జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం
తెలంగాణ రాష్ట్రంలో పలు విభాగాల్లో పనిచేయుటకు
జిల్లా స్టాఫర్లు
నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు
మండల రిపోర్టర్లు
ఆసక్తి, అనుభవం గల వారు సంప్రదించగలరు
సంప్రదించండి
77801 85674

RNI NO.TGTEL/25/A5224
# జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం
తెలంగాణ రాష్ట్రంలో పలు విభాగాల్లో పనిచేయుటకు
జిల్లా స్టాఫర్లు
నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు
మండల రిపోర్టర్లు
ఆసక్తి, అనుభవం గల వారు సంప్రదించగలరు
సంప్రదించండి
77801 85674

కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 213 శుక్రవారం, ఆగస్టు 21 2026, పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

## ఎయిడెడ్ పాఠశాల ఉద్యోగుల
# పదోన్నతులు ఎప్పుడొస్తాయో?


**హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ సహాయంతో కొనసాగుతున్న ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పదోన్నతుల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. 2012 సంవత్సరం నుంచి అనేక కేడర్లలో పదోన్నతులు నిలిచిపోవడంతో సుమారు 14 ఏళ్లుగా ఉద్యోగులు తదుపరి హోదాకు చేరుకోలేకపోతున్నారని ఎయిడెడ్ పాఠశాల ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీర్ఘకాలంగా పదోన్నతులు లేకపోవడం వల్ల తమ సర్వీసు కాలం నష్టపోవడంతోపాటు ఆర్థికంగా, వృత్తిపరంగా తీవ్రంగా నష్టపోతున్నామని వారు పేర్కొంటున్నారు.సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తూ అనుభవం, అర్హతలు సంపాదించినప్పటికీ పదోన్నతి అవకాశం లేకపోవడంతో ఉద్యోగులకు రావాల్సిన వేతన ప్రయోజనాలు, ఉన్నత హోదా, సీనియారిటీ ఆధారంగా లభించే అవకాశాలు, భవిష్యత్ సర్వీస్ ప్రయోజనాలపై ప్రభావం పడుతోందని తెలిపారు. పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న పలువురు ఉద్యోగులు ఇప్పటికే పదవీ విరమణ వయస్సుకు చేరుకుంటున్నారని, మరికొందరు పదోన్నతి పొందకుండానే సర్వీసు పూర్తి చేసే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నేళ్లుగా ఒకే హోదాలో పనిచేయడం ఉద్యోగులలో నిరుత్సాహానికి




కారణమవుతోందని పేర్కొన్నారు.విద్యారంగంలో ఎయిడెడ్ పాఠశాలలు ప్రభుత్వానికి ఎంతోకాలంగా సహకరిస్తున్నప్పటికీ, వాటిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పదోన్నతుల సమస్య మాత్రం పరిష్కారం కాకపోవడం పట్ల ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ సమస్యను సాధారణ పరిపాలనా అంశంగా కాకుండా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ సమస్యగా పరిగణించి ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. 2012 నుంచి నిలిచిపోయిన పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం తక్షణమే పునరుద్ధరించాలని, ఎయిడెడ్ పాఠశాలల్లోని అన్ని కేడర్లలో ఖాళీలు, అర్హతలు, సీనియారిటీని పరిశీలించి నిబంధనల ప్రకారం పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. పదోన్నతుల జాప్యం కారణంగా ఉద్యోగులు ఇప్పటికే కోల్పోయిన ఆర్థిక ప్రయోజనాలు, సర్వీస్ ప్రయోజనాలను కూడా ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి తగిన న్యాయం చేయాలని కోరుతున్నారు.ఎయిడెడ్ పాఠశాల ఉద్యోగుల పదోన్నతుల సమస్యపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుని, ప్రక్రియను వేగవంతం చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఈ సమస్యను ప్రజల, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వేలాది మంది ఎయిడెడ్ పాఠశాల ఉద్యోగులకు న్యాయం జరిగేలా సహకరించాలని వారు పత్రికలను కోరారు.

## ఇంటర్ బోర్డుపై విజిలెన్స్ కొరడా..
# గ్లోబరీనా టెండర్‌పై ఆరా





**హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి**

తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డులో 2019లో జరిగిన ఫలితాల వ్యవహారంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సుమారు నాలుగు గంటలపాటు కొనసాగిన ఈ సోదాల్లో 2019 ఇంటర్ ఫలితాల ప్రక్రియకు సంబంధించిన రికార్డులు, ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించినట్లు సమాచారం.2019లో ఫలితాల వెల్లడిలో చోటుచేసుకున్న తీవ్ర గందరగోళం, సాంకేతిక లోపాలు, మార్కుల కేటాయింపులో జరిగిన తప్పిదాలపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. అప్పట్లో డేటా ప్రాసెసింగ్ బాధ్యతలు చేపట్టిన గ్లోబరీనా సంస్థపై పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఫలితాల్లో తలెత్తిన పొరపాట్లతో అనేక మంది విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురికాగా, కొందరు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అసలు తప్పిదాలు ఎక్కడ జరిగాయి, బాధ్యులు ఎవరు, అప్పటి నిర్ణయాలు ఏ విధంగా తీసుకున్నారనే అంశాలపై విజిలెన్స్ అధికారులు ఆధారాలు సేకరిస్తున్నారు.గ్లోబరీనా సంస్థకు టెండర్ కేటాయించిన విధానం, టెండర్‌కు సంబంధించిన నిబంధనలు, సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం, డేటా ప్రాసెసింగ్ సమయంలో తీసుకున్న చర్యలు, అధికారుల పర్యవేక్షణ తదితర అంశాలపై అధికారులు ఆరా తీశారు. ఈ వ్యవహారానికి సంబంధించి కీలకమైన సమాచారం, పలు ముఖ్యమైన ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. నాటి ఇంటర్ బోర్డు మాజీ కార్యదర్శి అశోక్‌ను కూడా అధికారులు సుదీర్ఘంగా విచారించినట్లు సమాచారం. గ్లోబరీనా సంస్థకు సంబంధించిన వివరాలను అధికారులు ప్రశ్నించగా, సంబంధిత ఫైళ్లను పరిశీలిస్తేనే స్పష్టంగా చెప్పగలనని ఆయన పేర్కొన్నట్లు తెలుస్తోంది. దీంతో అధికారులు ఆయనను ఇంటర్ బోర్డు కార్యాలయానికి తీసుకువచ్చి సంబంధిత దస్త్రాల సమక్షంలో విచారించినట్లు సమాచారం. ఈ విచారణను గురువారం కూడా బీఆర్‌కే భవన్‌లో కొనసాగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## ఒంటరి మహిళా ఉద్యోగికి వేధింపులు..
# కేయూ హాస్టల్ సూపరింటెండెంట్‌పై ఫిర్యాదు

**హన్మకొండ జోర్దార్ ప్రతినిధి**

కాకతీయ యూనివర్సిటీ హాస్టల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి హాస్టల్ సూపరింటెండెంట్ పై తీవ్ర ఆరోపణలు చేస్తూ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. విధుల్లో భాగంగా తనతో అవమానకరంగా, అసభ్యంగా మాట్లాడటంతోపాటు మానసికంగా వేధిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఆగస్టు 17న ఉదయం 10.47 గంటల సమయంలో "గుడ్ మార్నింగ్ సర్" అని పలకరించినందుకు "తమాషా చేస్తున్నావా", "నాటకాలాడుతున్నావా", "యూజ్‌లెస్ ఫెలో" అంటూ దూషించారని, గతంలో "బేబీ", "ఇంటికి రమ్మంటావా" వంటి అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రవర్తన తనను తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తోందని తెలిపారు.ఆగస్టు 17న రాత్రి సుమారు 9.30 గంటలకు ఒక కార్యాలయ ఉద్యోగి తన ఇంటికి వచ్చి "సర్ ఆఫీస్‌కు రమ్మంటున్నాడు" అని చెప్పినట్లు మహిళా ఉద్యోగి పేర్కొన్నారు. ఆ సమయంలో తాను కార్యాలయానికి రాలేనని చెప్పినప్పటికీ రాత్రి వేళల్లో విధులకు రావాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. రాత్రి 7, 8, 8.30, 9 గంటలతోపాటు ఒక రోజు రాత్రి 10 గంటల వరకు కూడా పనిచేసినప్పటికీ తాను పని చేయడం లేదంటూ దూషిస్తున్నారని తెలిపారు. "ఒంటరి




ఆడదాని" వంటి అవమానకరమైన వ్యాఖ్యలు చేస్తూ పదేపదే కించపరుస్తున్నారని, ఈ పరిణామాల వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నానని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనపై లైంగిక వేధింపుల స్వరూపం కలిగిన వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపిస్తూ దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.తన ఫిర్యాదుపై ఎలాంటి ఒత్తిడి లేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని మహిళా ఉద్యోగి డిమాండ్ చేశారు. సంబంధిత రికార్డులు, సాక్షుల వాంగ్మూలాలు, విధుల సమయాలు, కాల్ వివరాలు తదితర ఆధారాలను పరిశీలించి ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే విచారణ పూర్తయ్యే వరకు తనపై ప్రతీకార చర్యలు లేదా మరింత వేధింపులు జరగకుండా రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు ప్రతులను వైస్ ఛాన్సలర్ కార్యాలయ కార్యదర్శి, కేయూ మహిళా విభాగం, యూనివర్సిటీ ఎన్‌జీవోల సంఘం, మైనారిటీ ఉద్యోగుల సంఘానికి కూడా అందజేసినట్లు సమాచారం. అయితే ఫిర్యాదులోని ఆరోపణలు విచారణలో నిర్ధారణ కావాల్సి ఉంది; సంబంధిత అధికారి వివరణ కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

# ఒకేషనల్ పోస్టుల క్రమబద్ధీకరణపై వివాదం

- అర్హులకు అన్యాయం జరిగిందని ఆరోపణలు..
- 45 పోస్టుల తారుమారుపై విజిలెన్స్‌కు ఫిర్యాదు

**హైదరాబాద్ జోర్దార్ నిఘా విభాగం**




ఇంటర్ విద్యాశాఖలో ఒకేషనల్ ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణ వ్యవహారం మరోసారి వివాదాస్పదంగా మారింది. 2023లో చేపట్టిన క్రమబద్ధీకరణలో నిబంధనలు, రోస్టర్, మెరిట్ తదితర అంశాలను సక్రమంగా పాటించకుండా సుమారు 45 సాంక్షన్ పోస్టులను ఇతరులకు కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయి. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పలువురు అధ్యాపకులకు అవకాశం దక్కలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై అప్పటి ఇంటర్ విద్యా కమిషనర్ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.ఒకేషనల్ విభాగంలో 184 మంది ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణ సమయంలో సాంక్షన్ పోస్టులు లేని సుమారు 45 మందికి ప్రయోజనం కల్పించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు నిబంధనల ప్రకారం అర్హతలు కలిగి, సుదీర్ఘకాలంగా సేవలందించిన 411 మంది అధ్యాపకులు నష్టపోయారని వారి కుటుంబాలు చెబుతున్నాయి. క్రమబద్ధీకరణలో రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్, మెరిట్, అర్హతల పరిశీలన వంటి అంశాల్లో అవకతవకలు జరిగాయని బాధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ అంశాలపై న్యాయస్థానాలను కూడా ఆశ్రయించినట్లు తెలుస్తోంది.గతంలో మినిమం టైం స్కేల్ అధ్యాపకుల క్రమబద్ధీకరణలోనూ సాంక్షన్ పోస్టులు లేని వారికి ప్రయోజనం కల్పించేందుకు డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు వచ్చినట్లు బాధితులు పేర్కొంటున్నారు. ఇంటర్ బోర్డులో దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఓ సెక్షన్ సూపరింటెండెంట్ పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు, కాంట్రాక్ట్ సంఘాల నాయకుల మధ్యవర్తిత్వంతో అర్హతలు లేని వారికి ప్రయోజనం కల్పించేందుకు భారీగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నప్పటికీ, వీటిపై అధికారిక నిర్ధారణ జరగాల్సి ఉంది. జనరల్, ఒకేషనల్ విభాగాల్లో కలిపి సుమారు 362 మంది జూనియర్ ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణలో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని అప్పటి కమిషనర్ శ్రీకృష్ణ ఆదిత్య సుప్రీంకోర్టుకు సమాచారం ఇచ్చినట్లు బాధితులు చెబుతున్నారు.ఇదిలా ఉండగా క్రమబద్ధీకరణలో అనర్హతలు, నకిలీ ధ్రువపత్రాల ఆరోపణలు ఎదుర్కొంటున్న 37 మందికి అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తం వ్యవహారంపై సమగ్ర విజిలెన్స్ దర్యాప్తు నిర్వహించి, పోస్టుల కేటాయింపు నుంచి అర్హతల పరిశీలన వరకు అన్ని అంశాలను వెలుగులోకి తేవాలని బాధిత అధ్యాపకులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పోస్టుల కేటాయింపు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, వివాదాస్పద పోస్టులను పునఃపరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని ముఖ్యమంత్రి, ఇంటర్ విద్యాశాఖ ఉన్నతాధికారులను వారు వేడుకుంటున్నారు.

## పెద్దపల్లి జిల్లాలో 'జీరో దందా'..
# అటవీ సంపదకు రక్షణ ఏదీ?

- అధికారుల కనుసన్నల్లోనే అక్రమ కలప రవాణా సాగుతోందన్న ఆరోపణలు..
- ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం

**పెద్దపల్లి జోర్దార్ ప్రతినిధి**

పెద్దపల్లి జిల్లాలో అటవీ సంపద అక్రమ రవాణాపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అడవులను సంరక్షించాల్సిన కొందరు అటవీశాఖ అధికారులు, సిబ్బంది అక్రమార్కులతో కుమ్మక్కై కలప 'జీరో దందా'కు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా, రికార్డుల్లో నమోదు చేయకుండా విలువైన కలపను రాత్రివేళల్లో తరలిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయ నష్టం వాటిల్లుతున్నప్పటికీ, కొందరు అధికారులు మాత్రం మామూళ్ల రూపంలో భారీగా ప్రయోజనం పొందుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.చీకటి పడిన తర్వాత అటవీ ప్రాంతాల నుంచి కలప లోడ్లతో వాహనాలు బయలుదేరుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. తనిఖీల నుంచి తప్పించుకునేందుకు నామమాత్రపు పత్రాలు, నకిలీ వే బిల్లులు వినియోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. చెక్‌పోస్టులు, తనిఖీ ప్రాంతాలను దాటే సమయంలో ముందుగానే మామూళ్లు ముట్టజెప్పి వాహనాలను ఎలాంటి అడ్డంకులు లేకుండా పంపిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ రవాణా వాహనాలపై సమాచారం ఉన్నప్పటికీ క్షేత్రస్థాయి సిబ్బంది పట్టించుకోవడం లేదన్న




ఆరోపణలు కూడా ఉన్నాయి.జిల్లాలోని అటవీ ప్రాంతాల నుంచి టేకు సహా ఇతర విలువైన కలపను పొరుగు జిల్లాలు, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక కలప డిపోలు, సామిల్లుల నిర్వాహకులతో కొందరు అధికారులు లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపితే అక్రమ రవాణా వెనుక ఉన్న వ్యక్తులు, మధ్యవర్తులు, అధికారుల పాత్ర వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. అటవీ సంపదను కాపాడాల్సిన వ్యవస్థలోనే అవినీతి ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. కలప అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడటంతో పాటు అటవీ విస్తీర్ణం, పర్యావరణ సమతుల్యతకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. 'జీరో దందా' ఆరోపణలపై ఉన్నతాధికారులు తక్షణమే ప్రత్యేక దృష్టి సారించి, రికార్డులు, అనుమతులు, రవాణా పత్రాలు, చెక్‌పోస్టుల వివరాలను సమగ్రంగా పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వరంగల్ మహానగరమే కానీ రహదారులు నరకం



**హసన్ పర్తి ,జోర్దార్ ప్రతినిధి:** వరంగల్ మహానగరం స్మార్ట్ సిటీ అని చెప్పుకోవడానికి సరిపోతుంది.కానీ గ్రేటర్ పరిధిలో విలీనమైన గ్రామాలు ఇప్పటికీ పల్లెలను తలపిస్తున్నాయి. 65వ డివిజన్ లోని కోమటిపల్లి ప్రాంతం, నీరుప్ నగర్‌లోని కాలనీల దారులు అభివృద్ధికి నోచుకోకపోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు,పాఠశాలలకు వెళ్లే బస్సులు గుంతల మయమైన మట్టిదారిలో ప్రయాణించాల్సి వస్తోంది.ప్రత్యేక నిధులు కేటాయించి రహదారులను అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.
గ్రేటర్ వరంగల్ పరిధిలోని విలీన గ్రామాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం



**హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:** మాజీ ప్రధానమంత్రి, దివంగత రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని హసన్‌పర్తి 66వ డివిజన్ బస్టాండ్ ఆవరణంలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా 66వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ దేశంలో సాంకేతిక, విద్యా రంగాల అభివృద్ధికి దూరదృష్టితో కృషి చేశారని అన్నారు. యువతపై ఆయనకు ఉన్న నమ్మకం, దేశ ప్రగతిపై ఆయన ఆలోచనలు నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.దేశ ఐక్యత, సామరస్యాన్ని బలోపేతం చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు,ఎస్సీ, బీసీ, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పవిత్ర మాసం శ్రావణం




శ్రావణమాసం ఆద్యంతం
పర్వదినాల మణిహారం
మాసములలో పవిత్రమాసం
ఈ యొక్క శ్రావణమాసం.

సిరులెన్నో కురిపించ
వచ్చేటి వరలక్ష్మి వ్రతం
లక్ష్మిదేవి గౌరీ మాతకు స్వాగతంగా
ఇల్లంతా శోభాయమానం.

ముత్తయిదువుల వాయినం
కుంకుమపూజ గౌరీ వ్రతం
సౌభాగ్యంకోసం లక్ష్మి దేవికి
ఉపవాస ఆరాధనం.

నాగుల చవితి, కృష్ణాష్టమి తోడుగా
అన్నచెల్లెళ్ల అనుబంధం రక్షా బంధనం
ఈనెలలోనే వచ్చేటి శుభ పర్వదినాల శ్రావణం.

ఆది దేవుడు గణపతి చవితి
జాతీయ పండగ పంద్రాగస్టు
ఈ మాసంలోనే యేతెంచిన
బహు పవిత్ర మాసం
శ్రావణ మాసం..!

భక్తిని పెంపొందించే మాసం
శుభములు పంచగా
ఆనందం పెంచగా...
యేతెంచిన శుభ మాసం!
పవిత్ర మాసం-శ్రావణ మాసం..!!



ఎన్.రాజేష్-ఎమ్మెస్సి,
కవి,జర్నలిస్ట్-హైదరాబాద్.

# ప్రజల సౌకర్యాల కోసం నిరంతరం పోరాటం చేస్తాం

- ఎంపీ వంశీకృష్ణ



**పెద్దపల్లి జోర్దార్ ప్రతినిధి:** ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో నిరంతరం ప్రస్తావిస్తూ, వారి హక్కుల కోసం పోరాడుతామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా సభా కార్యక్రమాలు స్తంభించిపోవడం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లోక్‌సభ స్పీకర్ పార్టీకి అతీతంగా వ్యవహరించాలని వంశీకృష్ణ సూచించారు. “స్పీకర్ బీజేపీ స్పీకర్‌గా కాకుండా లోక్‌సభ స్పీకర్‌గా వ్యవహరించాలి” అని అన్నారు. ప్రజల సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లేందుకు ఎంపీలు ప్రయత్నిస్తున్నప్పటికీ, చర్చకు సరైన అవకాశం లేకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.

**విద్యార్థుల హక్కుల కోసం పోరాటం**

తమ భవిష్యత్తు, హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోవడాన్ని ఎంపీ వంశీకృష్ణ ఖండించారు. విద్యార్థుల గొంతును అణచివేయడం పరిష్కారం కాదని అన్నారు. విద్యార్థుల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**‘బీజేపీ అంటే భారతదేశం కాదు’**

రాజకీయ భిన్నాభిప్రాయాలను దేశద్రోహంతో ముడిపెట్టే ధోరణిని వంశీకృష్ణ తప్పుబట్టారు. బీజేపీ సిద్ధాంతాలను వ్యతిరేకించడం దేశాన్ని వ్యతిరేకించడం కాదని అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతి భారతీయుడి హక్కు అని స్పష్టం చేశారు.

**రామమందిర నిధులపై ప్రశ్నలు**

రామమందిర అంశాన్ని ఎన్నికల రాజకీయాల కోసం ఉపయోగించుకున్నారని ఆరోపించిన వంశీకృష్ణ, ఆలయానికి సంబంధించిన నిధులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆలయానికి వెళ్లాల్సిన నిధులపై అవకతవకల ఆరోపణలు వస్తే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు.
ప్రజల హక్కులు, విద్యార్థుల భవిష్యత్తు, పారదర్శక పాలన కోసం తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు.

# సన్నకారు రైతుల కష్టాలు తీరెదెప్పుడో ?

- ధర్పల్లి లో యూరియా కొరతతో రైతుల ఇక్కట్లు
- అందని ద్రాక్షలా మారిన యూరియా
- రైతన్న కష్టాలు వర్ణనాతీతం

**నిజామాబాద్,జోర్ధార్ ప్రతినిధి:** ధర్పల్లి మండలంలో రైతన్నలు వరి నాట్లు నాటిన నుండి యూరియా అందని ద్రాక్షల మారింది. సొసైటీల వద్ద యూరియా బస్తాల కోసం రైతులు పడిగాపులు కాసే కష్టాలను తీర్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ పేరుతో ఆన్లైన్ లో రైతులు ఇంటి దగ్గరనే పంట పొలానికి కావలసిన యూరియా బస్తాలను బుక్ చేసుకుని సొసైటీలో యూరియా బస్తాలను కొనుగోలు చేసే సదుపాయాన్ని కల్పించింది. కానీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులను కష్టాల్లో నెట్టివేసిందనే చెప్పుకోవచ్చు. రైతన్నలు ఆన్లైన్ లో యూరియా బుక్ చేసుకుంటే నో స్టాక్ చూపెట్టడంతో అయోమయంలో ఆగమైపోతున్నరు. రాత్రుల్లో బుక్ అవుతున్నాయి అని కొందరి వాదనలు వినిపించడంతో యూరియా బస్తాల బుకింగ్ కోసం రాత్రుల్లో మొబైల్ ఫోన్ తో ఎదురుచూస్తున్న ప్రయోజనం లేకుండా పోయింది.వేసిన వరి నాట్లు వేసినట్లే ఉండిపాయే పుట్టెడు దుఃఖంలో దిక్కు తోచని స్థితిలో కన్నీరు మున్నీరు అవుతున్నరు. రాత్రుల్లో బుక్ చేసిన యూరియా ప్రొద్దున కల్లనో స్టాక్ తో రైతన్నకు ఆగం ఆగం అంతుచిక్కని సమాధానంగా మారిందని చెప్పుకోవచ్చు.
రైతన్నలు ఆన్లైన్‌లో బుక్ చేసుకున్న యూరియా షాపుల్లో దొరకని యూరియా బస్తాలు.
ఇప్పటికైనా ప్రభుత్వం యూరియా బస్తాల కొరతను తగ్గించి రైతులకు యూరియా బస్తాలు నిరంతరం అందుబాటులో ఉండేల చూడాలని రైతులు ఆకాంక్షిస్తున్నారు.



# గర్భిణీలకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలి

**హనుమకొండ,జోర్ధార్ ప్రతినిధి:** గర్భిణీలకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించి, హైరిస్క్ లక్షణాలు ఉన్న వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపడం ద్వారా మాతృ మరణాలను నివారించవచ్చని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ ఏ. అప్పయ్య అన్నారు.గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఈ ఏడాది జిల్లాలో సంభవించిన మూడు మాతృ మరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఒక్కో కేసును క్షుణ్ణంగా విశ్లేషించి, మరణాలకు గల కారణాలు, వైద్య సేవల్లోని లోపాలను గుర్తించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.గర్భ నిర్ధారణ జరిగిన వెంటనే, ముఖ్యంగా తొలి త్రైమాసికంలోనే గర్భిణీలను నమోదు చేయాలని, నిర్ణీత సమయాల్లో వైద్య పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. అవసరమైన సందర్భాల్లో గైనకాలజిస్టులు, ఇతర నిపుణుల సేవలు అందుబాటులో ఉన్న ఆసుపత్రులకు రిఫర్ చేయాలని సూచించారు. మాతా శిశు సంరక్షణ కార్డులోని ముఖ్యమైన సమాచారాన్ని గర్భిణీలకు వివరించి, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో మాతా శిశు సంక్షేమ కార్యక్రమ అధికారి డాక్టర్ రజిత, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, వైద్యులు,డెమో అశోక్ రెడ్డి, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పోరాటానికి బీఎస్పీ పూర్తి మద్దతు

- ఐదో రోజుకు చేరిన నిరసన దీక్షలు
- నల్ల బెలూన్లతో వినూత్న నిరసన

**హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:** హుజూరాబాద్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కోసం కొనసాగుతున్న న్యాయపోరాటానికి బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) పూర్తి మద్దతు ప్రకటించింది. హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద చేపట్టిన శాంతియుత నిరసన దీక్షలు గురువారం ఐదో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె ప్రశాంత్ గౌడ్, బీఎస్పీ నాయకులు, ముదిరాజ్ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య సందర్శించి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా పల్లె ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల సాధనకు ఐక్య పోరాటమే మార్గమన్నారు.
జర్నలిస్టుల సేవలను గుర్తించి ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాల విషయంలో వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కొలిపాక సమ్మయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల న్యాయమైన ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నాలను తిప్పికొట్టాలని అన్నారు.
సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు.
ఐదో రోజు నిరసనలో భాగంగా జర్నలిస్టులు నల్ల బెలూన్లను ఎగురవేసి, డప్పు చప్పుళ్లతో నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.
ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు గిన్నారపు మహేందర్, వేల్పుల మల్లేష్, అంబాల ప్రభాకర్, ఇల్లందుల రమేష్, మంద సమ్మయ్య, దొడ్డ సమ్మయ్య, జేఏసీ నాయకులు వేల్పులరత్నం, చందుపట్ల జనార్ధన్, ప్రెస్‌క్లబ్ జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే అర్హులకు కేటాయించాలి

- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**కమలాపూర్,జోర్దార్ ప్రతినిధి:** కమలాపూర్ మండల కేంద్రంలో నిర్మించిన 394 డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే అర్హులైన పేదలకు కేటాయించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమలాపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు.
ఇటీవల కమలాపూర్‌లో డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ వారం రోజుల్లో లబ్ధిదారుల జాబితా ప్రకటించి ప్రొసీడింగ్స్ అందజేస్తామని చెప్పారని, పది రోజులు గడిచినా జాబితా విడుదల చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.
అర్హుల జాబితా ప్రకటించినా ఇళ్లలోకి వెళ్లే పరిస్థితులు లేవని కౌశిక్ రెడ్డి అన్నారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు పూర్తికాలేదని, కొన్ని ఇళ్లలో తలుపులు, బాత్రూమ్‌లు దెబ్బతిన్నాయని తెలిపారు. కమలాపూర్‌తో పాటు గూడూరు, మరిపల్లి గూడెంలోని డబుల్ బెడ్రూం ఇళ్లకు కూడా ఇదే పరిస్థితి ఉందన్నారు.ఇళ్ల కేటాయింపులో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు, లక్షల రూపాయలు డిమాండ్ చేస్తున్నారనే ఆడియోలు తమ దృష్టికి వచ్చాయని పేర్కొంటూ, దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిజమైన పేదలకు మాత్రమే ఇళ్లు కేటాయించాలని స్పష్టం చేశారు.కమలాపూర్‌లో 394, గూడూరులో 50, మరిపల్లిగూడెంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల జాబితాలను వెంటనే ప్రకటించి, ప్రొసీడింగ్స్ అందజేసి, మౌలిక వసతులు పూర్తి చేసి ఇళ్లను అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లబ్ధిదారులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఎన్నికల హామీలను కూడా ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు.ఈ సమావేశంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ మార్కెట్ చైర్మన్ పోల్నేని సత్యనా రాయణరావు, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, తక్కలపల్లి సత్యనారాయణరావు, ఎర్రం ఇంద్ర సేనారెడ్డి, మాజీ జెడ్పీటీసీలు నవీన్, లక్ష్మణ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రాజేష్, వివిధ గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తది తరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలి




**నిజామాబాద్,జోర్ధార్ ప్రతినిధి:**డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెంటనే సొంత భవనం నిర్మించి, కనీస మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా నాయకులు ఎం. మున్నా మాట్లాడుతూ.. సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కళాశాలలో సరిపడా మూత్రశాలలు, తాగునీరు, లైబ్రరీ, ల్యాబ్‌లు వంటి కనీస సౌకర్యాలు కూడా లేవని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అన్ని వసతులతో కూడిన సొంత భవనాన్ని మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డిచ్‌పల్లి మండల నాయకులు అరవింద్, హేమాంజలి, రఘు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చిలుకమారి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



**హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:** బీసీ ఆజాద్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకమారి శ్రీనివాస్ జన్మదిన వేడుకలను హుజూరాబాద్ పట్టణంలో నియోజకవర్గ అధ్యక్షుడు పంజాల తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంజాల తిరుపతి గౌడ్ మాట్లాడుతూ వైద్య వృత్తితో పాటు కాట్రపల్లి శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్‌గా, పద్మశాలి సమాజ సేవా కార్యక్రమాల్లో, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో శ్రీనివాస్ చురుకుగా పాల్గొంటున్నారని తెలిపారు.

బీసీ ఉద్యమాలపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో సిలివేరు శ్రీకాంత్, సంగెం సత్యానారాయణ, పాత్రికేయులు శివమణి, కోడూరి శ్రీనివాస్, పబ్బ తిరుపతి, డాక్టర్ సంగెం ఐలయ్య, కందుకూరి భాస్కర్, మంచికట్ల కమలాకర్, రాజు, బొంగోని చంద్రమౌళి, ఆకుల సదానందం, మునీందర్, శ్రీనివాస్, ఉమాశంకర్, సాయి, శ్రావణ్, బొంగోని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాబుద్ధులు నేర్పిన గురువుపై ఇంతటి ఘాతుకమా? నిందితులకు కఠిన శిక్ష విధించాలి

**సామాజిక కార్యకర్త శశిధర్ రెడ్డి డిమాండ్**

**(హైదరాబాద్ దోర్దార్ ప్రతినిధి):**నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ శ్రీమతి రూపారెడ్డి గారిపై జరిగిన దారుణ హత్య సమాజం మొత్తం తలదించుకునేలా చేసింది. సమాజానికి మార్గదర్శకులుగా ఉండాల్సిన విద్యార్థులే, విద్యాబుద్ధులు నేర్పిన తమ ప్రిన్సిపల్‌ను కేవలం జల్సాలు, వ్యసనాల కోసం ఇంత పాశవికంగా హతమార్చడం తీవ్రంగా ఖండించదగిన విషయం.

విద్యా రంగానికే తీరని మచ్చ తెచ్చిన ఈ ఘటన తీవ్రమైన ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించి, బాధితురాలి కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాను.

**ఈ సందర్భంగా సమాజానికి, తల్లిదండ్రులకు మరియు ప్రభుత్వానికి నా విజ్ఞప్తి:**

తల్లిదండ్రుల బాధ్యత: నేటి సమాజంలో పిల్లల ప్రవర్తన, వారి స్నేహాలు, అలవాట్లపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ ఉంచాలి. కేవలం మార్కులు, ర్యాంకులకే పరిమితం కాకుండా, ఇంట్లోనే పిల్లలకు నైతిక విలువలు, జీవన నైపుణ్యాలు నేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**వ్యసనాల నిర్మూలన:** గంజాయి, ఇతర మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయి. సమాజంలోకి మత్తు పదార్థాలు రాకుండా ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలి.


**పాఠశాలల్లో 'లైఫ్ స్కిల్స్' విద్య తప్పనిసరి చేయాలి:**

పుస్తక జ్ఞానంతో పాటు భావోద్వేగాల నియంత్రణ సరైన నిర్ణయాధికారం, మంచి-చెడుల విచక్షణ నేర్పించే "లైఫ్ స్కిల్స్ ఎడ్యుకేషన్"ను పాఠశాల స్థాయి నుంచే ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలి.

మరొకసారి ఇలాంటి హృదయ విదారక ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, సమాజం కలిసికట్టుగా అడుగులు వేయాలని కోరుతున్నాను.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన జర్నలిస్ట్ మృతి

**నిజామాబాద్, జోర్ధార్ ప్రతినిది:**ఆగస్టు 8న తిరుమల కాలేజ్ ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఐ9 న్యూస్ రిపోర్టర్ అప్సర్ చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. రేపు ఉదయం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృత దేహాన్ని అప్పగించనున్నట్లు తెలిపారు.



# కమలాపూర్ పీహెచ్‌సీలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఆకస్మిక తనిఖీ

**కమలాపూర్,జోర్ధార్ ప్రతినిధి:**కమలాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణారావు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అమలవుతున్న సార్వత్రిక టీకాల కార్యక్రమం (యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్)ను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన చిన్నారులకు వయస్సుకు అనుగుణంగా టీకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని పరిశీలించడంతో పాటు టీకాల నమోదు రిజిస్టర్లు, వ్యాక్సిన్ నిల్వలు, కోల్డ్‌చైన్ నిర్వహణ, గర్భిణులు, చిన్నారుల ఇమ్యునైజేషన్ రికార్డులను తనిఖీ చేశారు.



గ్రామస్థాయిలో టీకాలపై అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి, తల్లిదండ్రులకు టీకాల ప్రాముఖ్యతను వివరించాలని డాక్టర్ కృష్ణారావు సూచించారు. టీకాల షెడ్యూల్‌ను కచ్చితంగా అమలు చేస్తూ ప్రజలకు నాణ్యమైన మాతా-శిశు ఆరోగ్య సేవలు అందించేందుకు ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, డాక్టర్ అరుణ్, ఆరోగ్య విస్తరణ అధికారి రవీందర్, హెల్త్ సూపర్వైజర్ శ్రీకాంత్, అమృత, స్టాఫ్ నర్సులు విశాలిని, సరిత, టీబీ నోడల్ పర్సన్ ప్రభాకర్, ల్యాబ్ టెక్నీషియన్ చందు తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# బాలికా విద్యకు ఎన్‌టీపీసీ ప్రోత్సాహం.. 171 సైకిళ్ల పంపిణీ





**(రామగుండం జోర్దార్ ప్రతినిధి)గోదావరిఖని:** బాలికలు విద్యను కొనసాగించేందుకు ప్రోత్సాహం అందించడంతో పాటు పాఠశాలలకు సులభంగా, సురక్షితంగా చేరుకునేలా చేయాలనే ఉద్దేశంతో ఎన్‌టీపీసీ రామగుండం ఆధ్వర్యంలో సీఎస్ఆర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రామగుండం మండలంలోని ఎనిమిది పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న బాలికలకు మొత్తం 171 సైకిళ్లను పంపిణీ చేశారు.

గోదావరిఖనిలోని అశోక్‌నగర్ జెడ్పీహెచ్ఎస్ (బాలికల) పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఇతర ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాలికలు పాఠశాలలకు వెళ్లేందుకు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను తగ్గించడం, ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా ప్రోత్సహించడం, విద్యాభ్యాసాన్ని నిరంతరాయంగా కొనసాగించేలా తోడ్పాటు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

సైకిళ్ల పంపిణీతో బాలికలకు పాఠశాలకు వెళ్లేందుకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడటంతో పాటు సమయం ఆదా అవుతుందని, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులకు ఇది మరింత ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించే ఇటువంటి కార్యక్రమాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

# ప్రజాస్వామ్యంలో ఎన్నికలే కీలకం

**జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్**

**హనుమకొండ జోర్దార్ ప్రతినిధి:**ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాజీపేట జాగీర్, (దర్గా) లో విద్యార్థులే భాగస్వామ్యం వహిస్తూ మాక్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ తదనంతరం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎన్ ఎమ్ ఎమ్. స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజు గౌడ్ పాల్గొని నిర్వాహకులను ప్రశంసించారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియ బాగుందని ప్రజాస్వామ్యం ద్వారానే మన దేశం అన్ని వర్గాల ప్రజలకు, పౌరులకు సమాన అవకాశాలు లభిస్తున్నాయని, తద్వారా సామాజిక న్యాయం జరుగుతుందని తెలియజేశారు. ఇటువంటి వినూత్న కార్యక్రమాలు అన్ని పాఠశాలలో నిర్వహించినట్లయితే విద్యార్థులకు ఎన్నికల విధానం పట్ల పూర్తి అవగాహన కలుగుతుందని భవిష్యత్తులో ఓటరుగా చురుకుగా పాల్గొనుటకు వీలవుతుందని తెలియజేశారు.

కాజీపేట మండల విద్యాశాఖ అధికారి బి మనోజ్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు చాలా బాగున్నాయి అని విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారని హెచ్ఎం అండ్ స్టాఫ్ ను విద్యార్థులను ప్రశంసించడం జరిగింది.

గ్రామ ప్రముఖులు,పూర్వ విద్యార్థులు ఎస్.రాజమోహన్, ఎస్. రాధాకృష్ణ,సత్యం మాట్లాడుతూ.. మాక్ ఎలక్షన్స్ ఇంత గొప్పగా జరగడం పాఠశాలలో ఇదే మొదటిసారని విద్యార్థులు భవిష్యత్తులో ఎన్నికల ప్రక్రియలో ఉత్సాహంగా పాల్గొనడానికి విద్యార్థులకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

పాఠశాలలో నిర్వహించిన మాక్ ఎన్నికల ప్రక్రియ ద్వారా ఈరోజు స్టూడెంట్స్ స్కూల్ హౌజెస్ ను మరియు క్లాస్ లీడర్స్ , పాఠశాల హెడ్ బాయ్,హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్, స్పోర్ట్స్ సెక్రటరీ, అసిస్టెంట్ స్పోర్ట్స్ సెక్రటరీతో పాటు క్లాస్ లీడర్స్ ని ఎన్నుకోవడం జరిగింది. వీరి సహకారంతో పాఠశాల పరిశుభ్రత,మంచినీటి వసతి,మధ్యాహ్న భోజన నిర్వహణ మొదలగు వాటిలో చురుకుగా పాల్గొంటూ నాయకత్వ లక్షణాలను సృజనాత్మకతను సమిష్టి నిర్వాహణా లక్ష్యాలను పెంపొందించుకుంటారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్ , ఉపాధ్యాయులు బి. సతీష్ పాల్, ఎన్.రాజు, బి. సునీత, బి సరోజ, టి. రాంగోపాల్, ఎండి. శంషుద్దీన్, అతియానస్రీన్, కె .స్నేహ లత, వరలక్ష్మి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





శుక్రవారం,
ఆగస్టు 21 2026

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



## రైస్ మిల్లులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

# రూ.8.60 కోట్ల బకాయి

**మంథని జోర్దార్ ప్రతినిధి:**పెద్దపల్లి జిల్లా మంథని మండలం సూరయ్యపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మి పారా బాయిల్డ్ రా రైస్ మిల్లులో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన యాక్షన్ పాడి విషయంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలపై అధికారులు మిల్లును తనిఖీ చేసినట్లు సమాచారం.మిల్లు యజమాని ప్రభుత్వానికి సుమారు రూ.8.60 కోట్లు బకాయి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బకాయి మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాలని విజిలెన్స్ అధికారులు సూచించడంతో మిల్లు యజమాని తక్షణంగా రూ.50 లక్షలకు చెక్కు అందజేసినట్లు తెలిపారు.మిగిలిన బకాయి మొత్తాన్ని ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా పూర్తిగా చెల్లిస్తానని మిల్లు యజమాని అధికారులకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిల విషయంలో నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులు సూచించారు.ఈ తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ సీతారెడ్డి, సీఐలు అనిల్ కుమార్, వరుణ్ కుమార్, తహసీల్దార్ దినేష్ చంద్ర, సివిల్ సప్లైస్ డీటీ పోచయ్య, ఎఫ్ఐ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ బకాయిల చెల్లింపుపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

## రోడ్డు వేశారు..భద్రత మరిచారు

● కాలువ వద్ద కల్వర్టు,రక్షణ ఏర్పాట్లు లేక ఇబ్బందులు



**కమాన్‌పూర్, జోర్దార్ విలేఖరి:**కమాన్‌పూర్--సిద్దిపల్లె ప్రధాన రహదారిపై రోడ్డు నిర్మాణం పూర్తయినా, కాలువ వద్ద కల్వర్టు, రక్షణ గోడలు ఏర్పాటు చేయకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళ ప్రమాదాలు జరగకుండా రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని చెబుతున్నారు.రోడ్డు నిర్మాణానికి నిధులు ఉన్నప్పుడు భద్రతా ఏర్పాట్లకు నిధులు లేవా? ప్రమాదం జరిగిన తర్వాతే అధికారులు స్పందిస్తారా? అని బీజేపీ నాయకుడు మల్లారపు అరుణ్‌కుమార్ ప్రశ్నించారు. కాలువ వద్ద వెంటనే కల్వర్టు, రక్షణ గోడలు, రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# న్యాయవాద దంపతుల కేసులో సిబిఐ దూకుడు






**మంథని జోర్దార్ ప్రతినిధి:** మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధును మరోసారి విచారించిన సీబీఐ అధికారులు.

పెద్దపల్లి జిల్లా మంథని కి చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది గట్టు వామన్ రావు దంపతుల హత్య కేసులో సిబిఐ దూకుడు పెంచింది. ఈ మేరకు గురువారం నాడు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధును మరో సారి విచారించింది.

న్యాయవాద దంపతుల హత్య కేసులో విచారణ జరుపుతున్న సిబిఐ అధికారులు గురువారం రామగుండం కమిషనరేట్ కార్యాలయం ఆవరణలోని సిబిఐ క్యాంపు కార్యాలయం లో మంథని మాజీ ఎం ఎల్ ఏ పుట్టమధు ను విచారించారు. ఐతే ఈ హత్యాకేసు లో మధు సాక్ష్యం అవసరమని , ఈ కేసు లో నిజాల కోసం ప్రశ్నించాలని 160 సీఆర్పీసీ కింద ఈ నెల 18 న సిబిఐ అధికారులు మధుకు నోటీస్ జారీచేశారు.

దీంతో ఆయన గురువారం విచారణకు హాజరయ్యారు. సుమారు 20 నిమిషాల పాటు ఈ విచారణ కొనసాగింది.

ఇప్పటికే ఈ హత్య పై రామగిరి పోలీస్ స్టేషన్లో 2021లో కేసు నమోదై విచారణ జరుగుతుండగా సెప్టెంబర్ లో వామన్ రావు తండ్రి కిషన్ రావు సుప్రీమ్ కోర్ట్ లో తన కుమారుడు, కోడలు హత్యపై సిబిఐ విచారణ జరుపాలని సెప్టెంబర్ 2021 లో సుప్రీం కోర్టు ను ఆశ్రయించగా..జస్టిస్ ఎం ఎం సుందరేశ్,జస్టిస్ ఎన్.కె.సింగ్లా ధర్మాసనం సిబిఐ విచారణకు ఆదేశించిన విషయం విధితమే. కాగా గురువారం నాడు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధును సిబిఐ అధికారులు విచారించడం జిల్లాలో ప్రాధాన్యత అంశంగా మారింది.

## చేతులు కాలాక.. ఆకులు పట్టుకున్నారా?

**హైదరాబాద్, జోర్దార్ ప్రతినిధి:**సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బకాయిల విషయంలో సివిల్ సప్లై శాఖ వ్యవహరించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం, అధికారులు సకాలంలో కఠిన చర్యలు తీసుకోకపోవడంతో కోట్ల రూపాయల విలువైన బియ్యం గోదాములకు చేరకుండా పోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.2021--22 నుంచి సేకరించిన ధాన్యానికి అనుగుణంగా పలువురు మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి అప్పగించలేదని సమాచారం. కొందరు మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని విక్రయించి వచ్చిన డబ్బులను రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాల్లోకి మళ్లించారన్న ఆరోపణలు ఉన్నాయి. సాధారణ బకాయిదారులపై కఠిన చర్యలు తీసుకునే అధికారులు భారీ మొత్తంలో బకాయిలు ఉన్న మిల్లర్ల విషయంలో ఎందుకు ఉదారంగా వ్యవహ రించారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ బకాయిలపై దృష్టి సారించి పలువురు మిల్లర్లపై కేసులు నమోదు చేయడంతో పాటు అరెస్టులు చేపట్టింది. రూ.20 కోట్లకు పైగా బకాయిలు ఉన్న తొమ్మిది మంది మిల్లర్లపై పీడీ యాక్ట్ నమోదు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. మిగిలిన బకాయిదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు తెలుస్తోంది. మొదట్లోనే కఠినంగా వ్యవహరించి ఉంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# టేకుమట్లలో ఘనంగా

## రాజీవ్‌గాంధీ 82వ జయంతి వేడుకలు



**టేకుమట్ల జోర్దార్ ప్రతినిది:**మండల కేంద్రంలో మాజీ ప్రధాని, దివంగత రాజీవ్‌గాంధీ 82వ జయంతి వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో పలువురికి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ దేశానికి ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. దేశంలో సాంకేతికతను ప్రోత్సహించి, సమాచార సాంకేతిక రంగం అభివృద్ధికి బాటలు వేశారని పేర్కొన్నారు. టెలికం రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి పల్లెపల్లెకూ టెలిఫోన్ సౌకర్యాన్ని విస్తరించారని కొనియాడారు.

ఆయన తీసుకున్న నిర్ణయాల ఫలితంగానే భారత్ నేడు ఐటీ రంగంలో ప్రపంచ స్థాయిలో ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వైనాల రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి దాసారపు సదానందం, ఉపాధ్యక్షులు మోతే రాజమౌళి, మాదం కొమురయ్య, కోశాధికారి శాస్త్రాల కిరణ్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుర్రే మల్లయ్య, కూర వెంకటరాజిరెడ్డి, గంధం సారయ్య, పొన్నం సాంబయ్య, అంబాల కిరణ్, పెరుమ ండ్ల చంద్రకళ, వ్యాసన వేన శ్రీలేఖ సతీష్‌రావు, మొగిలి, మారం రచన శ్రీకాంత్, వంగ మమత శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. సీనియర్ నా యకులు తోట గట్టయ్య, సట్ల కొమురయ్య, కత్తి సంపత్, కొయ్యల చిరంజీవి, బండ రఘోత్త మ్‌రెడ్డి, కనుమరుగుల సంపత్, ఏఎంసీ డైరెక్టర్ బిక్కినేని సంపత్‌రావు, అంబరగొండ బుచ్చయ్య, వంగ నరేష్, తెలబోయిన రాజేందర్, అంబాల రమేష్, దాసరి కుమార్, ఎడ్ల రమేష్, బీతు రాజు, జంగంపల్లి సారయ్య, చెక్క ఓదెలు, మం దల రాజిరెడ్డి, ఉప సర్పంచులు నల్లబెల్లి మొండయ్య, కౌడగాని నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

● డీపీఆర్ఓపై వచ్చిన ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలి

● తక్షణ చర్యలు లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

**నిజామాబాద్:**

**జోర్దార్‌ప్రతినిధి:** జిల్లాలో జర్నలిస్టులపై వేధింపులు, అక్రమ కేసుల నమోదును నిరసిస్తూ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు ఆవేదన, నిరసన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అవినీతి అక్రమాలను ప్రశ్నించడం, వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం జర్నలిస్టుల వృత్తి బాధ్యత అని పేర్కొన్నారు. తమ వృత్తి బాధ్యతలు నిర్వహిస్తున్న జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడి కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు.

నిజామాబాద్ జిల్లాలో 32 సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో సేవలందిస్తున్న 60 ఏళ్లకు పైబడిన సీనియర్ జర్నలిస్టుపై కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టుగా ఆయనకున్న సుదీర్ఘ అనుభవం, ప్రజలకు అందించిన సేవలను పరిగణనలోకి తీసుకోకుండా కేసు నమోదు చేయడం అన్యాయమని అన్నారు.

**ఆర్టీఐ ద్వారా సమాచారం కోరితే కేసా?**

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులకు సంబంధించిన సమాచారాన్ని సమాచార హక్కు చట్టం కింద కోరినందుకు కక్ష సాధింపు ధోరణితో తప్పుడు ఆరోపణలు చేస్తూ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారనే ఆరోపణలు చేశారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

అక్రిడిటేషన్ కార్డుల కోసం లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలు కూడా తీవ్రంగా పరిశీలించాల్సిన అంశమని పేర్కొన్నారు. రూ.35 వేల లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ఫిర్యాదులపై కూడా అదే వేగంతో విచారణ జరపాలి**

ఒక జర్నలిస్టుపై ఫిర్యాదు వచ్చిన కొద్దిసేపటికే ఎఫ్ఐఆర్ నమోదు చేయగలిగిన అధికారులు, అదే విధంగా జర్నలిస్టులు చేసిన ఫిర్యాదులు, అవినీతి ఆరోపణలు, అక్రమాలకు సంబంధించిన అంశాలపైనా నిష్పక్షపాతంగా విచారణ జరపాలని అన్నారు. చట్టం అందరికీ సమానంగా వర్తించాలన్నారు.

ఈ నేపథ్యంలో జర్నలిస్టుపై నమోదైన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే డీపీఆర్ఓపై వచ్చిన ఆరోపణలపై స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు.

విచారణలో ఆరోపణలు నిజమని తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తాం**

జర్నలిస్టుల హక్కులను కాలరాసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. ప్రజాసంఘాలు, జర్నలిస్టు యూనియన్లు, ఇతర సంఘాలు ఈ అంశంపై స్పందించి జర్నలిస్టులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టులపై నమోదైన కేసులను సమీక్షించి, అక్రమంగా నమోదైన కేసులను ఉపసంహరించాలని కోరారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందించాలని, అక్రిడిటేషన్ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.

తమ డిమాండ్లపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జర్నలిస్టుల హక్కులను కాపాడటం, వేధింపులను అరికట్టడం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం కోసం నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు.

## టౌన్ పరిధిలో 52 మొబైల్ ఫోన్లు రికవరీ



**నిజామాబాద్,జోర్ధార్ ప్రతినిధి:**నిజామాబాద్ టౌన్- పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 52 మొబైల్ ఫోన్లను పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ట్రాక్ చేసి రికవరీ చేశారు. వాటి యజమానులను గుర్తించి, ధృవీకరణ అనంతరం ఫోన్లను వారికి అప్పగించారు.

మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే బ్యాంకు ఖాతాలు, ఫోన్‌పే, గూగుల్‌పే వంటి డిజిటల్ చెల్లింపు ఖాతాలను తాత్కాలికంగా బ్లాక్ చేయించుకోవాలని పోలీసులు సూచించారు. అలాగే పోర్టల్‌లో ఫిర్యాదు చేసి, సమీప పోలీస్ స్టేషన్‌లో కూడా సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఫోన్ల రికవరీలో కృషి చేసిన సిబ్బందిని అధికారులు అభినందించారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం
శుక్రవారం,
ఆగస్టు 21 2026


# రామాయణ శ్లోకాల నుంచి ఏఐ కోడింగ్ వరకు విద్యార్థి దశ నుంచే విజేతగా హంసిని ప్రస్థానం

● ఆల్ రౌండర్ గోపగోని హంసిని అరుదైన ప్రతిభ





**జోర్దార్ డెస్క్,హైదరాబాద్:**నేటి పోటీ ప్రపంచంలో చాలామంది పిల్లలు చదువు, ర్యాంకులు, కోరికల చుట్టూనే తమ ప్రపంచాన్ని నిర్మించుకుంటారు. చదువులో నంబర్ వన్‌గా నిలుస్తూనే, ఇంట్లోని ఆర్థిక పరిస్థితులను అవగతం చేసుకుని, నైతిక బాధ్యతతో ప్రవర్తించే పిల్లలు అరుదుగా ఉంటారు. అయితే హైదరాబాద్‌కు చెందిన గోపగోని హంసిని విద్యార్థిగా తాను విజయాలు సాధిస్తూ, తోటివారికి దారిచూపిస్తూ ముందుకు సాగుతోంది. అరుదైన వ్యక్తిత్వానికి, అద్భుతమైన ప్రతిభకు అద్దం పడుతోంది. పాఠశాల స్థాయి నుంచే అలవరచుకున్న క్రమశిక్షణ, ఆలోచనా పరిణతి, నిరంతర శ్రమ, అంకిత భావం, ఆర్థిక స్పృహ ఒక చిన్నారిని కెరీర్ ప్రారంభంలోనే ఎలా ఉన్నత స్థానంలో నిలబెడతాయో నిరూపించింది గోపగోని హంసిని.

ఒక వైపు భక్తి, సంస్కృతి, సంప్రదాయ విలువలు.. మరోవైపు ఆధునిక సాంకేతికత, కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ).. ఈ రెంటినీ సమతుల్యం చేసుకుంటూ ఎదిగింది హంసిని. ఇలా ఒక్కో మెట్టు ఎక్కుతూనే కుటుంబం పట్ల బాధ్యతలతో అడుగులు వేస్తూ నేడు గ్లోబల్ ఐటీ దిగ్గజం హెచ్ సి ఎల్ టెక్నాలజీస్ లో “టెక్ బి” గా జాయిన్ అయింది. సమకాలీన సమాజంలో విద్యార్థులు, యువతకు ఆదర్శంగా నిలుస్తోన్న హంసిని ప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం.

**స్ఫూర్తినిచ్చే నాయకత్వం :**
హంసిని ఇంట గెలిచి రచ్చ గెలిచిన అమ్మాయి. ఇంట్లో పెద్దమ్మాయిగా తన బాధ్యతలను చిన్నతనం నుంచే ఎంతో పరిణతితో స్వీకరించింది. చిన్నప్పటి నుంచే చదువులో ప్రతిభ కనబరుస్తూ వస్తోన్న హంసిని.. తన ఇద్దరు చెల్లెళ్లు సహస్ర, సాత్వికలకు మార్గదర్శిగా నిలుస్తోంది. అలా బోధనా నైపుణ్యాన్ని కూడా విద్యార్థి దశలోనే వంటబట్టించుకుంది. చెల్లెళ్లకు చదువులో సందేహాలు నివృత్తి చేయడం, సంక్లిష్టమైన అంశాలను సులభంగా అర్థమయ్యేలా వివరించడం ఆమెలో చిన్నతనంలోనే లీడర్‌షిప్ నైపుణ్యాలను పెంపొందించింది. తాను స్వయంగా గ్రహించిన, అనుసరిస్తోన్న పరీక్షల వ్యూహాలను చెల్లెళ్లకు కూడా పంచుతూ వారి చదువులోనూ కీలక పాత్ర పోషిస్తోంది.

**విద్యలో మైలురాళ్లు :**
హంసిని విద్యా ప్రయాణం అద్భుతమైన ఫలితాల సమాహారంగా చెప్పుకోవచ్చు. హార్డ్ వర్క్ ప్లస్ స్మార్ట్ వర్క్ జతకలిస్తే వచ్చే ఫలితాలకు హంసిని మార్కులే నిదర్శనం అవుతున్నాయి. పదో తరగతిలో 9.0 సి జి పి ఏ సాధించింది. ఇంటర్మీడియట్‌లో 93.5 శాతం మార్కులతో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించింది. అంతేకాదు.. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో తన సత్తా చాటి, దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీ వంటి సంస్థల్లో తొలి ప్రయత్నంలోనే సీటు సాధించింది.

**బహుముఖ ప్రజ్ఞ -- అవార్డులు, రివార్డుల పంట :**
హంసిని వివిధ విభాగాలలో ప్రతిభ చూపి పలు జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు, ప్రశంసా పత్రాలు సొంతం చేసుకుంది. ఆమె సాధించిన కొన్ని అవార్డులు, రివార్డులు గమనిస్తే...

- ‘కోడింగల్’ సంస్థ నిర్వహించిన టెక్నాలజీ ఆప్టిట్యూడ్ అండ్ కోడింగ్ విభాగంలో టాప్ 10 పర్సంటైల్ సాధించి స్టెమ్ గుర్తింపు పొందిన ‘కోడింగ్ స్టార్’ సర్టిఫికేట్ పొందింది.
- ఆర్థోడాక్స్ కోడింగ్‌తో పాటు ‘ఏఐ ఫర్ టెకిస్’ ద్వారా ఏఐ- అసిస్టెడ్ కోడింగ్, పైథాన్ విజువలైజేషన్స్ నేర్చుకుని వర్క్ షాప్ సర్టిఫికేట్ సాధించింది.
- అంతరిక్ష విజ్ఞానంలో తన ఆసక్తికి నిదర్శనంగా భారత ప్రభుత్వ కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ (ఎన్సీఈఆర్టీ) నిర్వహించిన “అప్నా చంద్రయాన్” క్విజ్‌లో సర్టిఫికేట్ పొందింది.
- తొమ్మిదో తరగతిలోనే ఒలంపియాడ్ లో తనదైన ప్రతిభను చూపించింది.
- ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా జాతీయ సాహిత్య పరిషత్ అండ్ యువ భారతి నిర్వహించిన బాల గంగాధర్ తిలక్ ఉపన్యాస పోటీలలో ప్రశంసాపత్రం అందుకుంది.
- ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా జాతీయ సాహిత్య పరిషత్ అండ్ యువ భారతి నిర్వహించిన ఉపన్యాస పోటీలలో శ్రీమద్రామాయణంలో ‘గుహుడు’ పాత్రపై ప్రసంగించి ‘బాల వాగ్వాహిని’గా ప్రశంసాపత్రాన్ని అందుకుంది.
- యువ భారతి ఆధ్వర్యంలో భగవద్గీత సాంఖ్య యోగ శ్లోక పఠన పోటీలో పాల్గొని ప్రశంసాపత్రం పొందింది.
- ఈనాడు దినపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించి అందరి ప్రశంసలు అందుకుంది.
- పదో తరగతి ఫలితాల్లో చూపిన అత్యుత్తమ ప్రతిభకు గాను హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ద్వారా స్కాలర్షిప్ , ప్రశంసా పత్రాన్ని అందుకుంది. అలాగే, పదో తరగతిలో - సాధించిన అత్యుత్తమ మార్కులకు గానూ కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక ప్రశంసాపత్రాన్ని అందుకుంది.
- దసరా, బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా ధృవాంశ్ డ్యాన్స్ అకాడమీ నిర్వహించిన నృత్యపోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచింది.
- ఆర్ట్ ఆఫ్ లివింగ్ నిర్వహించిన 21-డేస్ మెడిటేషన్ ఛాలెంజ్‌లో “గోల్డ్ సర్టిఫికేట్” సాధించింది.

**పరిణతి చెందిన ఆలోచన -- ఆర్థిక స్పృహ, కుటుంబానికి అండ :**హంసిని ప్రత్యేకత కేవలం పుస్తకాలు, చదువులకే పరిమితం కాలేదు. అలాగే, ప్రతిభ, విజ్ఞానానికి సంబంధించిన అవార్డులు, రివార్డులతోనే సరిపెట్టుకోలేదు. ఇంట్లోని పరిస్థితులను తనకు తానే అర్థం చేసుకునేంతటి సూక్ష్మగ్రాహి ఆ చిన్నారి. ఎంత బాగా చదువుతున్నా, ప్రతి క్లాసులో ర్యాంకులు సాధిస్తున్నా ఏనాడూ తల్లిదండ్రులను ఖరీదైన కోరికలతో ఇబ్బంది పెట్టలేదు, మారాం చేయలేదు హంసిని. పిన్న వయసులోనే ఆర్థిక వివేచన ఆమె సొంతం. ప్రతి విషయంలోనూ కుటుంబానికి ఏది తక్కువ ఖర్చు అవుతుందో, ఏది ఉపయోగకరమో అటువైపే మొగ్గు చూపేది. మరోవైపు.. తల్లిదండ్రులకు ఇంటి పనుల్లో సహాయపడుతూ ఒక ఆదర్శవంతమైన కూతురిగా నిలిచింది హంసిని.

**ఏఐ ఇంజనీర్ లక్ష్యం -- ఎర్లీ కెరీర్ విజయం :**
తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలపై పట్టు, కమ్యూనికేషన్ స్కిల్స్, మానసిక ఏకాగ్రత, కృత్రిమ మేధ రంగంలో ఎదగాలనే స్పష్టమైన ఆశయంతో తనదైన లక్ష్యాన్ని నిర్దేశించుకుంది హంసిని. నేటి వేగవంతమైన సాంకేతిక ప్రపంచంలో విద్యతో పాటు కెరీర్‌ను కూడా సమాంతరంగా ప్రారంభించాలనే సరికొత్త ఆలోచనతో ఆమె హెచ్ సి ఎల్ ఎర్లీ కెరీర్ ప్రోగ్రాం ను ఎంచుకుంది.

కఠినమైన ఎంపిక ప్రక్రియ, పోటీని తట్టుకుని, తొలి ప్రయత్నంలోనే హంసిని విజేతగా నిలిచి హెచ్ సి ఎల్ టెక్ బి గా ఎంపికై, చదువుకుంటూనే ఉద్యోగం చేసే అరుదైన మైలురాయిని చేరుకుంది.

**నేటి తరం యువతకు స్ఫూర్తి :**
లక్ష్యం స్పష్టంగా ఉండి, దానికి క్రమశిక్షణ, నిరంతర శ్రమ, సాంకేతికతపై ఆసక్తి, కుటుంబం పట్ల బాధ్యత తోడైతే సాధించలేనిది ఏదీ లేదని గోపగోని హంసిని నిరూపించింది. సంస్కృతిని విస్మరించకుండా, ఆధునిక సాంకేతిక రంగాన్ని స్వాగతిస్తూ సొంత కాళ్లపై నిలబడుతున్న హంసిని.. నేటి తరం విద్యార్థులకు, ముఖ్యంగా స్వయం సమృద్ధిని కాంక్షించే యువతకు ఒక గొప్ప రోల్ మోడల్. గోపగోని హంసిని భవిష్యత్తులో సాంకేతిక ప్రపంచంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిద్దాం...

## ఉర్సు ప్రభుత్వ హైస్కూల్ కాంప్లెక్స్ సెక్రటరీగా ఊటుకూరి అశోక్ నియామకం



**(వరంగల్లో జోర్దార్ ప్రతినిధి):**ఖిలా వరంగల్ మండలంలోని ఉర్సు ప్రభుత్వ హైస్కూల్ కాంప్లెక్స్ సెక్రటరీగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఊటుకూరి అశోక్ ఏకగ్రీవంగా నియామకం అయినారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ పూసారాం, జిల్లా ప్రధాన కార్యదర్శి పి. వీరాచారి, వీ. వెంకటేశ్వర్లు, ఖ. బిక్షపతి, ప్రవీణ్ కుమార్,విజయ్ కుమార్,లు వెంకట రమణి, రమేష్ ఇంకా కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు అభినందనలు తెలిపినారు.

## రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఘనంగా సేవా కార్యక్రమం



● మానవత సాధన్ స్కూల్ విద్యార్థులకు పండ్ల పంపిణీ.

**నిజామాబాద్, జోర్ధార్ ప్రతినిధి:**డిచ్ పల్లి మండలం ఘనపూర్ గ్రామంలో మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు.

నిజామాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ ఆదేశాల మేరకు, డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామంలోని మానవత సాధన్ స్కూల్ విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పండ్లు అందించి రాజీవ్ గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ రూరల్ అధ్యక్షులు తూంపల్లి మహేందర్ హాజరై విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాజీవ్ గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్ర టరీ ఆకాష్ రెడ్డి, ఉపాధ్యక్షులు సోప్పిరి వినోద్, జనరల్ సెక్రటరీ పురుషోత్తం రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, ఇందల్వాయి మండల అధ్యక్షులు ధామ సుమన్, సీనియర్ నాయకులు సంతోష్ నాయక్, ఫరూక్, హరీష్, ప్రణయ్, వినోద్, రాజ్ కుమార్, సంజీవ్, శివ తదితర యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ జయంతిని కేవలం వేడుకగా కాకుండా సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువ చేసే కార్యక్రమంగా నిర్వహించడం పట్ల పలు వురు అభినందనలు తెలిపారు.

# కనీస గౌరవ వేతనం చెల్లించాలి




**నిజామాబాద్,జోర్ధార్ ప్రతినిధి:**గౌరవప్రద జీవన కనీస వేతనంకై పోరాడాలని కనీస వేతనం39 ,373 రూపాయలు ఇవ్వాలని నాలుగు లేబర్ కోర్స్ రద్దు చేయాలని
టియుసిఐ జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ధర్పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు ప్రదర్శన,ధర్నా ఎంపీవో కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న టియుసిఐ నిజామాబాద్ రూరల్ కామారెడ్డి సంయుక్త జిల్లా కార్యదర్శి ఆర్.రమేష్ మాట్లాడుతూ...కార్మిక శాఖ పరిశీలన మరియు చర్యల కోసం అవసరాల ఆధారిత కనీస వేతనం చట్టమైన కనీస వేతనాల నిర్ణయానికి శాస్త్రీయ సూత్రాలు అనే ప్రాతిపాదికన ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఇక్కడ మీ ముందు ఉంచుతున్నది అని అన్నారు. చట్టబద్ధమైన కనీస వేతనం అనేది నిజమైన అవసరాల ఆధారిత కనిసవేతనంగా ఉండాలని, కార్మికులు వారి కుటుంబాలు కేవలం పేదరికంలో జీవించేలా ఉండే స్థాయిలో దానిని నిర్ణయించ కూడదని టియుసిఐ నిలకడగా వాదిస్తుంది అని అన్నారు. చట బద్ధమైన కనీస వేతనం కార్మికుడి అతని కుటుంబానికి అవసరమైన ప్రాథమిక అవసరాలని తీర్చడానికి వారి ఆరోగ్య పని సామర్థ్యం గౌరవాన్ని నిలబెట్టుకోవడానికి సరిపోయేలా ఉండాలని అన్నారు. 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (1975) నిర్దేశించిన విధానాలను, వర్క్ మెన్ రిప్రెజెంటెడ్ బై సెక్రటరీ వర్సెస్ మేనేజ్మెంట్ రాష్ట్ర కోస్ బ్రేట్ అండ్ కో లిమిటెడ్ (1992) 290 కేసులో సుప్రీంకోర్టు గుర్తించిన సూత్రాల ఆధారంగా ఈ శాస్త్రీయ విధానాన్ని జత చేయబడిన నోట్ వివరిస్తుంది అని అన్నారు. అలాగే నాలుగు వినియోగ యూనిట్ల ఆమోదం, గృహ వసతి భాగం, వేరియబుల్ డియర్ నెస్ ద్వారా జీవన వ్యాయాల పెరుగుదలను 100% బ్యాలెన్స్ చేయడం వంటి అంశాలపై టి యు సి ఐ స్పష్టమైన వైఖరి తెలియజేస్తుందని అన్నారు.

ప్రస్తుత ధరలకు ఈ సూత్రాలను వర్తింపజేసి, గత చేయబడిన నోట్లో వివరించిన ప్రతిపాదికన మే 2026 నాటికి నెలకు 39,373 రూపాయలను అవసరాల ఆధారిత కనీస వేతనంగా ఇవ్వాలని తీసేయగా డిమాండ్ చేస్తున్నాము అని అన్నారు.

కాబట్టి జత చేయబడిన నోటు రికార్డులోకి తీసుకొని కనీస అవసరాలు తీరని వేతనాలపై ఆధారపడేలా చేయడం కాకుండా శాస్త్రీయంగా నిర్ణ యించిన అవసరాల ఆధారిత వేతనంగానే చట్టబద్ధమైన కనీస వేతనాన్ని నిర్ణయించాలని ప్రాథమిక సూత్రానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని పివిసి కార్మిక శాఖను కోరుతున్నది అని అన్నారు.

అట్లాగే కాంగ్రెస్ ప్రభుత్వం వికారంలోకి రాగానే గ్రామపంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తామని ఒకటో తారీకు తమ ఖాతాలో జమ చేస్తామని మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలనీ టి యు సి ఐ గా డిమాండ్ చేశారు. లేనియెడల సమ్మెకు అనువార్యంగా సమ్మె వెళ్ళవలసి వస్తున్నదని హెచ్చరిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ధర్పల్లి మండల అధ్యక్షులు ఆశన్న, సిరికొండ మండల అధ్యక్షులు, మండల నాయకులు సాయిలు, విలాస్, జగన్,వర్షిత్, సర్బుద్దిన్ శారద, సులోచన,సాయవ్వ,రాధ తదితర కార్మికులు పాల్గొన్నారు.

# పరిశుభ్రమైన చేతులు ఆరోగ్యానికి రక్షణ కవచం



● విద్యార్థులకు శానిటేషన్‌పై అవగాహన కార్యక్రమం

**(వీణవంక , జోర్దార్ ప్రతినిధి):**వీణవంక మండలంలోని ఎంపీ యుపిఎస్ హిమ్మత్‌నగర్ పాఠశాలలో శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు చేతులను పరిశుభ్రంగా, సక్రమంగా కడుక్కోవాల్సిన విధానం గురించి శిక్షణ ఇచ్చారు. చేతులు శుభ్రంగా కడుక్కోకపోవడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని సూచించారు.

అనంతరం పాఠశాలలో ఆరోగ్య సమస్యలు ఉన్న విద్యార్థుల వివరాలను ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశా వర్కర్ సరిత నమోదు చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోనె సత్యం, సీనియర్ ఉపాధ్యాయులు వేణు, అంగన్‌వాడీ టీచర్లు లావణ్య, స్వరూప, ఆయమ్మ రాధమ్మ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రూపారెడ్డి హత్యను ఖండిస్తూ శాంతి ర్యాలీ
## గురువుల గౌరవాన్ని కాపాడాలని పిలుపు



**రామగిరి జోర్దార్ ప్రతినిధి:** నల్గొండ జిల్లా నాగార్జున స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న రూపారెడ్డి హత్యను ఖండిస్తూ రామగిరి మండలంలోని కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. గురువులపై దాడులు, హింసాత్మక ఘటనలు పునరావృతం కాకుండా సమాజంలో గురువుల పట్ల గౌరవ భావాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా నిర్వాహకులు పేర్కొన్నారు. సమాజానికి దిశానిర్దేశం చేస్తూ, భవిష్యత్ భారత పౌరులను తీర్చిదిద్దే గురువులు అనేక సందర్భాల్లో అవమానాలను ఎదుర్కొంటూనే సమాజహితమే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. అలాంటి ఉపాధ్యాయుల జీవితాలు హింసకు బలవుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాగార్జున స్కూల్‌లో విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టే క్రమంలో మందలించిన ప్రిన్సిపాల్ రూపారెడ్డిపై అదే పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు దాడి చేసి హత్య చేసిన ఘటన దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు. ఈ ఘటన సమాజంలో గురువు పాత్ర, గౌరవం, బాధ్యతలపై మరోసారి ఆలోచించాల్సిన పరిస్థితిని కల్పించిందన్నారు. పిల్లలకు గురువుల ప్రాముఖ్యతను తెలియజేయాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు గురువుల ప్రాముఖ్యత, గౌరవం, విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర గురించి అవగాహన కల్పించాలని నిర్వాహకులు కోరారు. ఉపాధ్యాయులపై జరిగే హింసాత్మక ఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో రూపారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ నివాళులు అర్పించారు. కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ బర్ల శ్రీనివాస్, డైరెక్టర్లు శ్రీధర్ బాబు, రంజిత్ రెడ్డితో పాటు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

రూపారెడ్డి హత్యకు నిరసనగా మరుసటి రోజు పాఠశాలకు సెలవు ప్రకటించినట్లు విద్యాసంస్థల యాజమాన్యం తెలిపింది. గురువుల గౌరవం, విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువల పెంపొందనకు సమాజం మొత్తం కలిసి కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# అక్రమ నల్లరాయి క్వారీలను నిలిపివేయాలి




● **కలెక్టర్ హామీతో ఆందోళన విరమించిన ఆదివాసీ రైతులు**

**రంపచోడవరం, ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో:** పోలవరం జిల్లా గంగవరం మండలం జగ్గంపాలెం పంచాయతీ పరిధిలోని ఓజాబంద గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ రైతులు, ప్రజలు రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

గ్రామసభ ఆమోదం లేకుండా భీముడు దిబ్బల కొండలో మైనింగ్ నిర్వహిస్తున్నారని వారు ఆరోపించారు. భారీ బ్లాస్టింగ్‌ల కారణంగా ఇళ్లు బీటలు వారడంతో పాటు పంట కాలువలు దెబ్బతింటున్నాయని, కొండల నుంచి బండరాళ్లు పడటంతో జీడిమామిడి తోటలు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీలను వెంటనే నిలిపివేసి గిరిజనుల భూములు, జీవనోపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు. ధర్నా వద్దకు చేరుకున్న జిల్లా కలెక్టర్, ఐటీడీఏ అధికారులు బాధితుల నుంచి వినతిపత్రం స్వీకరించారు.

అక్రమ మైనింగ్‌పై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆదివాసీలు ఆందోళన విరమించారు.

న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు తెలిపారు.

# శ్రీలంకలోని జాఫ్నాలో సామూహిక సమాధి..
## బయటపడిన 582 అస్థిపంజరాలు



**కొలంబో:** శ్రీలంకలోని జాఫ్నాలో సామూహిక సమాధి బయటపడింది. పిల్లలతో సహా 582 అస్థిపంజరాలు వెలుగులోకి వచ్చాయి. స్వతంత్ర తమిళ రాజ్యం కోసం పోరాడిన తమిళ టైగర్స్ అయిన ఎల్టీటీఈ, ప్రభుత్వ దళాల మధ్య జరిగిన భీకర అంతర్యుద్ధం సమయంలో అదృశ్యమైన తమిళ పౌరులకు చెందిన అవశేషాలుగా భావిస్తున్నారు.

జాఫ్నా సమీపంలోని చెమ్మని వద్ద జరిగిన తవ్వకాలలో ఇవి బయటపడ్డాయి. పిల్లల బొమ్మలు, పాల సీసాలు, స్కూల్ బ్యాగులు, బూట్లు, గాజుల వంటి వస్తువులు కూడా లభించాయి. ఛాతికి అడ్డంగా రెండు చేతులు కట్టివేసిన స్థితిలో ఉన్న ఒక మానవ అస్థిపంజరం కూడా అక్కడ లభించింది.

కాగా, అంతర్యుద్ధ సమయంలో తమిళ పౌరులను శ్రీలంక సైన్యం కాల్చి చంపి చెమ్మని ప్రాంతంలో సామూహిక ఖననాలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

గత ఏడాది ఇదే సామూహిక సమాధి ప్రదేశంలో 240 మానవ అస్థిపంజరాలు బయటపడ్డాయి. నిజానికి 1998 నుంచే చెమ్మని ప్రాంతం ఒక సామూహిక సమాధి ప్రదేశంగా అనుమానించారు. ఒక పాఠశాల విద్యార్థినిపై అత్యాచారం, హత్య కేసులో అప్పట్లో విచారణ ఎదుర్కొన్న ఒక శ్రీలంక సైనికుడు ఈ విషయాన్ని బయటపెట్టాడు. అదుపులో ఉన్న సుమారు 400 మంది తమిళులను సైన్యం చంపి చెమ్మనిలో పాతిపెట్టినట్లు దర్యాప్తు అధికారులకు వెల్లడించాడు.

మరోవైపు 1999లో ఇక్కడ జరిపిన తవ్వకాల్లో 15 అస్థిపంజరాలు బయటపడ్డాయి. వీటిలో 10 అస్థిపంజరాలపై తీవ్రమైన దాడికి సంబంధించిన గుర్తులు ఉన్నట్లు ప్రభుత్వ విచారణలో తేలింది. ఆ తర్వాత ఆ విచారణను నిలిపివేశారు. దశాబ్దాల జాప్యం, నిధుల కొరత కారణంగా తవ్వకాలు కూడా ఆగిపోయాయి.

అయితే తాజాగా ఒక హిందూ శ్మశానవాటిక సమీపంలో అస్థిపంజర అవశేషాలను నిర్మాణ కార్మికులు గుర్తించారు. ఈ నేపథ్యంలో బుధవారం తాజాగా ఇక్కడ తవ్వకాలు జరుపడంతో 582 అస్థిపంజరాలు బయటపడ్డాయి. ఈ సామూహిక సమాధుల తవ్వకం కోసం తమిళనాడు ప్రభుత్వం ఇప్పటి వరకు సుమారు రూ.62 లక్షల నిధులు కేటాయించింది.

కాగా, 1983 నుంచి దశాబ్దాల పాటు వేలుపిళ్లై ప్రభాకరన్ నేతృత్వంలోని ఎల్టీటీఈ, ప్రభుత్వ సైన్యం మధ్య జరిగిన పోరాటంలో సుమారు లక్ష మందికి పైగా ప్రజలు మరణించారు. ఈ సంఘర్షణ కారణంగా వేలాది మంది మైనారిటీ తమిళులు అదృశ్యమయ్యారు.

అయితే శ్రీలంక భద్రతా దళాలే కాకుండా, ఎల్టీటీఈ కూడా అపహరణలు, హత్యలు, అత్యాచారాలు, ఇతర అకృత్యాలకు పాల్పడిందనే ఆరోపణలు ఉన్నాయి. 1995 నుంచి అంతర్యుద్ధం ముగిసే వరకు జాఫ్నాలోని చెమ్మని ప్రాంతం సైనిక నియంత్రణలో ఉన్నది.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు




**(వీణవంక జోర్దార్ ప్రతినిధి):** మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 82 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి, అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. దేశంలో సాంకేతిక రంగ అభివృద్ధికి రాజీవ్ గాంధీ విశేష కృషి చేశారని, చిన్న వయసులోనే ప్రధానిగా బాధ్యతలు చేపట్టి అనేక సంస్కరణలు చేపట్టారని కొనియాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీదేనని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎండీ సాహెబ్ హుస్సేన్, గంగాడి రాజీ రెడ్డి, గంగాడి తిరుపతి రెడ్డి, చిన్నాల ఐలయ్య, జిల్లా కార్యదర్శులు వావినిల సత్యనారాయణ, కంకణాల జగదీశ్వర్ రెడ్డి, సర్పంచ్ అందె శ్రీమతి-కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ గూటం సమ్మిరెడ్డి, డైరెక్టర్ కామిడి శ్రీపతి రెడ్డి, ధర్మకర్త జున్నుతుల మధుకర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు మోటం శ్రీనివాస్, మాజీ సర్పంచులు మేకల ఎల్లారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు మడ్డి అనిల్, గొట్టే రాజయ్యతో పాటు నల్ల కొండల్ రెడ్డి, చదువు జైపాల్ రెడ్డి, మసాడి చొక్కారావు, కట్కూరి ఉపేందర్ రెడ్డి, కండె మహేందర్, నాగిడి రాంరెడ్డి, బత్తుల వెంకటస్వామి, గుంటి రవీందర్, పల్లెర్ల కిరణ్, సబ్బని శ్రీనివాస్, గాజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రీడయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు చేసే మంచి బ్యాక్టీరియా..
## ఏం చేస్తే పొందవచ్చు..?



భారత్‌లో ప్రీడయాబెటిస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంతోపాటు పేగు ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టడం ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్న వయసులోనే ప్రీడయాబెటిస్ వచ్చే ప్రమాదాన్ని తగ్గించేందుకు ఆహారం, శారీరక చురుకుదనం, నిద్ర, ఒత్తిడి నియంత్రణ వంటి జీవనశైలి మార్పులు కీలకంగా మారుతున్నాయి. పేగుల్లోని సూక్ష్మజీవుల సమతుల్యత దెబ్బతింటే ఇన్సులిన్ నిరోధకత, గ్లూకోజ్ నియంత్రణలో సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ప్రీడయాబెటిస్ అంటే రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణం కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ, డయాబెటిస్ స్థాయికి ఇంకా చేరని పరిస్థితి. ఫాస్టింగ్ బ్లడ్ గ్లూకోజ్ 100–125 మధ్య ఉండటం, భోజనం తర్వాత రెండు గంటల రక్తంలో గ్లూకోజ్ మధ్య ఉండటం లేదా  శాతం మధ్య ఉండటం ప్రీడయాబెటిస్‌కు సూచనలుగా పరిగణిస్తారు. చిన్న వయసులోనే ప్రీడయాబెటిస్ రావడానికి అనారోగ్యకరమైన ఆహారం, శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం, జీవక్రియలో మార్పులు, ఇతర పర్యావరణ కారణాలు దోహదం చేస్తాయని అంటున్నారు.

**షుగర్‌కు, పేగుల ఆరోగ్యానికి సంబంధం..**

పేగు ఆరోగ్యం, రక్తంలో చక్కెర నియంత్రణకు మధ్య సంబంధం ఉంది. పేగుల్లో ఉండే ప్రయోజనకరమైన బ్యాక్టీరియా రకాల వైవిధ్యం తగ్గడం లేదా పేగు సూక్ష్మజీవుల సమతుల్యత దెబ్బతినడాన్ని గట్ డైస్బయోసిస్ అంటారు. ఇలాంటి మార్పులు గ్లూకోజ్ జీవక్రియ, ఇన్సులిన్ సెన్సిటివిటీపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. పేగు, కాలేయం, ప్యాంక్రియాస్ పరస్పరం అనుసంధానమై పనిచేసే వ్యవస్థలో భాగాలు కావడంతో, ఒకదానిలో వచ్చే మార్పులు మరొకదానిపై ప్రభావం చూపుతాయి. కడుపు ఉబ్బరం ఒక్కటే మెటబాలిక్ ఆరోగ్యం సరిగా లేదని నిర్ధారించే లక్షణం కాదు. అయితే ఉబ్బరంతోపాటు గ్యాస్, మలబద్ధకం, అలసట, తరచూ తీపి పదార్థాలు తినాలనే కోరిక, పొట్ట చుట్టూ బరువు పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తే జీవనశైలి, మెటబాలిక్ ఆరోగ్యంపై దృష్టి పెట్టడం మంచిది. పేగుల్లోని సూక్ష్మజీవుల సమతుల్యత దెబ్బతినడం వల్ల శరీరంలో అంతర్గత వాపు, గ్లూకోజ్ నియంత్రణలో మార్పులు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ముందుగా ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. సంపూర్ణ ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు వంటి ఆహారాలు పేగుల్లోని ప్రయోజనకరమైన బ్యాక్టీరియాకు మద్దతు ఇస్తాయి. సహజమైన ప్రీబయోటిక్స్‌ను ఆహారంలో చేర్చడం కూడా పేగు సూక్ష్మజీవుల ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది.

**ప్రోబయోటిక్ ఆహారాలను తీసుకుంటే..**

పెరుగు, పులియబెట్టిన కూరగాయలు వంటి ప్రోబయోటిక్ ఆహారాలను తీసుకోవడం ద్వారా కూడా జీర్ణాశయ ఆరోగ్యానికి మద్దతు లభిస్తుంది. అయితే ప్రోబయోటిక్స్‌ను మాత్రమే ఆధారంగా చేసుకోవడం కాకుండా, మొత్తం ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా తీసుకోవడం ముఖ్యమని పరిశోధనలు సూచిస్తున్నాయి. అదే సమయంలో అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాలను తగ్గించడం అవసరం. అధిక చక్కెర, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు, కృత్రిమ పదార్థాలు ఎక్కువగా ఉండే అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్స్‌ను అధికంగా తీసుకోవడం పేగు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. వాటికి బదులుగా సహజమైన, పోషకాలు అధికంగా ఉండే ఆహారాలను ఎంచుకోవడం మంచిది. నిద్రకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. శరీరానికి తగిన విశ్రాంతి లభించినప్పుడు పేగు పనితీరు మెరుగ్గా ఉండే అవకాశం ఉంటుంది. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల పేగుల్లోని సూక్ష్మజీవుల వైవిధ్యానికి, రక్తంలో గ్లూకోజ్ నియంత్రణకు మద్దతు లభిస్తుంది.

**ఒత్తిడిని తగ్గించాలి..**

ఒత్తిడిని నియంత్రించడం కూడా ముఖ్యమే. పేగు, మెదడు మధ్య సన్నిహిత సంబంధం ఉండటంతో, ఒత్తిడి పెరిగినప్పుడు విడుదలయ్యే కార్టిసాల్ హార్మోన్ రక్తంలో చక్కెర నియంత్రణపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందువల్ల తగిన నిద్ర, శారీరక శ్రమ, ఒత్తిడి నియంత్రణ వంటి అలవాట్లు పేగు ఆరోగ్యంతోపాటు మెటబాలిక్ ఆరోగ్యానికి కూడా ఉపయోగపడతాయి. ఓట్స్, కందిపప్పు వంటి పప్పుధాన్యాలు, బీన్స్, ఆకుకూరలు, గింజలు, విత్తనాలు, పెరుగు, బెర్రీలు వంటి ఆహారాలను సమతుల్య ఆహారంలో భాగంగా చేర్చుకోవచ్చు. ఇవి పేగు ఆరోగ్యానికి, రక్తంలో చక్కెర నియంత్రణకు అవసరమైన పోషకాలను అందించడంలో సహాయపడతాయి. ప్రోబయోటిక్స్ తీసుకోవడం వల్ల ఫాస్టింగ్ ప్లాస్మా గ్లూకోజ్, ఇన్సులిన్ స్థాయిలపై కొంత ప్రయోజనకరమైన ప్రభావం ఉంటుందని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే ఇవి ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం వంటి జీవనశైలి మార్పులకు ప్రత్యామ్నాయం కావు.

**ఈ లక్షణాలు ఉంటే..**

అధికంగా దాహం వేయడం, తరచూ మూత్ర విసర్జన చేయడం, ఎప్పుడూ ఆకలిగా అనిపించడం, నిరంతర అలసట, చూపు మసకబారడం, చర్మంపై నల్లని మచ్చలు లేదా రంగు మారడం, ఊహించని విధంగా బరువు పెరగడం లేదా తగ్గడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు. ఇవి కనిపించినప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించుకోవడం అవసరం అవుతుంది. ప్రీడయాబెటిస్‌ను గుర్తించేందుకు ప్రధానంగా ఫాస్టింగ్ బ్లడ్ గ్లూకోజ్, ఓరల్ గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్ వంటి పరీక్షలను ఉపయోగిస్తారు. ఈ పరీక్షల ఫలితాలను వైద్య నిపుణుడి సలహాతో అర్థం చేసుకోవాలి. పేగు సూక్ష్మజీవుల్లో ఆహార మార్పుల తర్వాత 24–48 గంటల్లోనే కొన్ని మార్పులు కనిపిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నప్పటికీ, స్థిరమైన దీర్ఘకాలిక మార్పులు రావడానికి అనేక వారాల నుంచి నెలల వరకు పడుతుంది. అందువల్ల పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం కోసం తాత్కాలిక డైట్ కంటే నిరంతరం పాటించే ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రాధాన్యత ఇవ్వడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు

# పెద్దపల్లి జిల్లాలో అటవీశాఖ అధికారుల
## అవినీతి భాగోతం బట్టబయలైంది

**(పెద్దపల్లి జోర్దార్ ప్రతినిధి):** అధికారుల కనుసన్నల్లోనే యథేచ్ఛగా సాగుతున్న కలప జీరో దందా మరియు అక్రమ రవాణాపై ప్రత్యేక కథనం.

ప్రభుత్వ ఖజానాకు గండి అధికారులకు కోట్లు పెద్దపల్లి జిల్లాలో అటవీ సంపద కొల్లగొట్టుకుపోతోంది.

నిబంధనల ప్రకారం అడవులను కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులతో చేతులు కలిపారు. ఎలాంటి అనుమతులు (పర్మిట్లు) లేకుండా, రికార్డుల్లో నమోదు చేయకుండా రాత్రికి రాత్రే విలువైన కర్రను తరలిస్తూ 'జీరో దందా'కు తెరలేపారు.

ఈ అక్రమ రవాణాను ప్రోత్సహిస్తూ కొందరు ఉన్నతాధికారులు, సిబ్బంది ప్రతి నెలా కోట్ల రూపాయలు గడిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ రవాణా సాగుతోందిలా..

**రాత్రి వేళల్లో రవాణా:**

చీకటి పడగానే అటవీ ప్రాంతాల నుండి కలప లోడ్లతో లారీలు సరిహద్దులు దాటుతున్నాయి.

**నకిలీ వే బిల్లులు:**

తనిఖీల్లో దొరకకుండా ఉండేందుకు నామమాత్రపు పత్రాలు, నకిలీ వే బిల్లులను సృష్టిస్తున్నారు. మామూళ్ల పంపిణీ: ప్రతి చెక్‌పోస్ట్ దాటడానికి ముందే అధికారులకు భారీగా లంచాలు అందుతున్నాయి.

**కన్నుమూస్తున్న సిబ్బంది:** అక్రమ రవాణా వాహనాల సమాచారం ఉన్నప్పటికీ క్షేత్రస్థాయి సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సరిహద్దులు దాటుతున్న అటవీ సంపద జిల్లాలోని అటవీ ప్రాంతాల నుండి టేకు, ఇతర విలువైన కలప పొరుగు జిల్లాలకు మరియు రాష్ట్రాలకు యథేచ్ఛగా తరలిపోతోంది. స్థానిక కలప డిపోలు, సామిల్లుల యజమానులతో అధికారులు లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, పర్యావరణాన్ని నాశనం చేస్తున్న ఈ అవినీతి నెట్‌వర్క్‌పై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరపాలని ప్రజలు, పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం
శుక్రవారం,
ఆగస్టు 21 2026



# 600వ టెస్టులో ఘన విజయం..



టీమిండియా తన మొట్టమొదటి టెస్టు మ్యాచ్‌ను స్వాతంత్ర్యానికి పూర్వమే 1932లో లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్‌తో ఆడింది. నాటి బలమైన ఇంగ్లాండ్ జట్టు చేతిలో భారత్ 158 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. సరిగ్గా 35 ఏళ్ల తర్వాత 1967లో బర్మింగ్‌హామ్ వేదికగా ఇంగ్లాండ్‌పైనే తమ 100వ టెస్టును ఆడిన భారత జట్టు తీవ్ర పోరాటం చేసినప్పటికీ 132 పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది. ప్రారంభ దశాబ్దాల్లో విదేశీ గడ్డపై మ్యాచ్‌లు గెలవడం భారత్‌కు సవాలుగా ఉండేదనడానికి ఈ ఫలితాలే నిదర్శనం. 200, 300వ టెస్టులు..1982లో లాహోర్ వేదికగా చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో టీమిండియా తన 200వ టెస్టును ఆడింది. మొహిందర్ అమర్‌నాథ్ అద్భుత సెంచరీతో రాణించడంతో ఈ మ్యాచ్ సమర్థవంతంగా డ్రాగా ముగిసింది. ఆ తర్వాత 1996లో అహ్మదాబాద్ వేదికగా పటిష్టమైన సౌతాఫ్రికాపై భారత్ తన 300వ టెస్టు ఆడింది. అనిల్ కుంబ్లే, జవగల్ శ్రీనాథ్ పదునైన బౌలింగ్ ధాటికి పర్యాటక ప్రోటీస్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 105 పరుగులకే కుప్పకూలడంతో భారత్ 64 పరుగుల తేడాతో చారిత్రక విజయాన్ని అందుకుంది. 400, 500వ టెస్టులు..2006లో కింగ్‌స్టన్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన 400వ టెస్టులో రాహుల్ ద్రవిడ్ సారథ్యంలో భారత్ 49 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. కఠినమైన పిచ్‌పై ప్రతికూల పరిస్థితులను అధిగమించి విజయాన్ని ముద్దాడింది. అనంతరం 2016లో కాన్పూర్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన 500వ మైలురాయి టెస్టులో రవిచంద్రన్ అశ్విన్ మ్యాజిక్ బౌలింగ్‌తో టీమిండియా 197 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి రెడ్ బాల్ ఫార్మాట్‌లో తిరుగులేని ఆధిపత్యాన్ని నిరూపించింది. 600వ టెస్టులో లంకపై చారిత్రాత్మక విజయంఆగస్టు 2026లో శ్రీలంకలోని గాలే మైదానంలో శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో ఆడిన 600వ టెస్టు మ్యాచ్ భారత క్రికెట్ చరిత్రలోనే ప్రత్యేకంగా నిలిచిపోయింది. దేవదత్ పడిక్కల్ అద్భుత శతకం (167), స్పిన్నర్ మానవ్ సుతార్ 10 వికెట్ల మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనతో లంకను 165 పరుగుల తేడాతో మట్టికరిపించి భారత్ విజయభేరి మోగించింది. ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా తర్వాత ప్రపంచంలోనే 600 టెస్టులు పూర్తి చేసుకున్న మూడో దేశంగా, ఆసియాలోనే మొదటి జట్టుగా భారత్ అరుదైన ఘనత సొంతం చేసుకుంది. 1932లో తొలి అడుగు వేసిన భారత్, 600వ టెస్టు నాటికి ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన క్రికెట్ శక్తులలో ఒకటిగా ఎదిగింది. ప్రతి వందవ టెస్టులో సాధించిన ప్రగతి భారత జట్టు సాధించిన అభివృద్ధికి, ఆటగాళ్ల పట్టుదలకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది.

# బంగారం కొనే వారికి బిగ్ రిలీఫ్.




బంగారం కొనుగోలు చేసే వారికి ఇదో స్వల్ప ఊరట అనే చెప్పాలి. ఎందుకంటే గత కొన్ని రోజులు పెరుగుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు ప్రస్తుతం తగ్గుముఖం పట్టాయి. శనివారంతో పోల్చుకుంటే ఈ ఆభరణాల ధరల్లో పెద్దగా పెరుగుదల కనిపించలేదు.. పైగా ధరలు స్వల్పంగా దిగొచ్చాయి. అంతర్జాతీయ పరిణామాలు, డాలర్ విలువ విలువ మారకం కారణంగా ధరల్లో ఈ మార్పులు వచ్చినట్టు విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం సోమవారం ఉదయం 6 గంటలకు హైదరాబాద్‌లో 24 క్యారట్ల 10 గ్రాముల బంగారం ధర చూస్తే.. రూ.1,52,340 వద్ద కొనసాగుతుండగా.. ధర రూ.1,52,350గా ఉంది. ఇక 22 క్యారట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,39,640గా ఉండగా నిన్న ఈ ధర రూ.1,39,650 వద్ద కొనసాగింది. ఇక అటు వెండి కూడా బంగారం బాటలోనే నడుస్తోంది. శనివారంతో పోల్చుకుంటే వెండి ధరల్లో కూడా స్వల్ప తగ్గుదల కనిపించింది. ప్రస్తుతం హైదరాబా ద్‌లో కేజీ వెండి ధర రూ.2,49,800గా ఉండగా నిన్న ఈ ధర రూ.2,49,900 వద్ద కొనసాగింది.దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇవేహైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,340 వద్ద ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,39,640 వద్ద ట్రేడవుతోంది.విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,340 వద్ద ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,39,640 వద్ద ట్రేడవుతోంది.
ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,540 వద్ద ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,38,840 వద్ద ట్రేడవుతోంది.ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,340 వద్ద ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,39,640 వద్ద ట్రేడవుతోంది.
బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,340 వద్ద ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,39,640 వద్ద ట్రేడవుతోంది.చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,630 వద్ద ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,38,990 వద్ద ట్రేడవుతోంది.

# క్రికెట్ గతిని మార్చిన 5 షాట్లు.. ఇవి కనిపెట్టినోళ్లకు మొక్కినా తప్పులేదు!



క్రికెట్‌లో సాంప్రదాయ షాట్లైన కవర్ డ్రైవ్, స్ట్రెయిట్ డ్రైవ్, పుల్, కట్, హుక్ వంటి షాట్లు అందరికీ తెలిసిందే. అయితే టీ20 క్రికెట్ అభివృద్ధి చెందడంతో బ్యాటర్లు కొత్త తరహా షాట్లను కనిపెట్టారు. బౌలర్ల వ్యూహాలను ఛేదించేందుకు వినూత్న షాట్లతో పరుగులు సాధిస్తున్నారు. కొన్ని షాట్లు ప్రేక్షకులను ఆశ్చర్యపరచడమే కాకుండా మ్యాచ్ ఫలితాన్నే మార్చే స్థాయిలో ప్రభావం చూపుతున్నాయి. అలాంటి ఐదు విచిత్రమైన షాట్లు ఇవే.స్విచ్ హిట్
ఈ షాట్‌ను ఆడే సమయంలో బ్యాటర్ బంతి వేయకముందే తన స్టాన్స్‌ను మార్చుకుంటాడు. కుడిచేతి బ్యాటర్ ఎడమచేతి బ్యాటర్‌లా, ఎడమచేతి బ్యాటర్ కుడిచేతి బ్యాటర్‌లా మారి షాట్ ఆడతాడు. దీంతో ఫీల్డింగ్ సెట్టింగ్‌ను బౌలర్‌కు వ్యతిరేకంగా ఉపయోగించుకోవచ్చు. ఈ షాట్‌ను ఇంగ్లండ్ మాజీ ఆటగాడు కెవిన్ పీటర్సన్ ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తీసుకొచ్చాడు.దిల్‌స్కూప్శ్రీలంక దిగ్గజ బ్యాటర్ తిలకరత్నే దిల్షాన్ పరిచయం చేసిన ఈ షాట్ అతని పేరుతోనే ప్రసిద్ధి చెందింది. వికెట్ కీపర్ తలపైగా ఫైన్ లెగ్ దిశగా బంతిని స్కూప్ చేస్తూ ఆడతారు. యార్కర్లు లేదా ఫుల్ లెంగ్త్ బంతులను బౌండరీకి తరలించేందుకు ఈ షాట్ ఉపయోగపడుతుంది. సరైన టైమింగ్ లేకపోతే ఔటయ్యే ప్రమాదం ఎక్కువ. ర్యాంప్ షాట్ఈ షాట్‌లో బ్యాటర్ బ్యాట్‌ను కోణంలో ఉంచి బంతి వేగాన్నే ఉపయోగించి వికెట్ కీపర్ లేదా షార్ట్ థర్డ్‌మ్యాన్ మీదుగా బంతిని పంపిస్తాడు. వేగంగా వచ్చే బంతులను కూడా సులభంగా బౌండరీకి తరలించే అవకాశం ఉంటుంది. టీ20 క్రికెట్‌లో ఈ షాట్ తరచూ కనిపిస్తుంది.హెలికాప్టర్ షాట్
భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీతో ఈ షాట్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. యార్కర్ బంతులను కూడా మణికట్టు బలంతో లెగ్‌సైడ్ వైపు సిక్సర్లుగా మలచడం ఈ షాట్ ప్రత్యేకత. షాట్ పూర్తయ్యాక బ్యాట్ హెలికాప్టర్ రెక్కలా తిరుగుతుండటంతో దీనికి ఈ పేరు వచ్చింది. ఇది అత్యంత కష్టమైన షాట్లలో ఒకటిగా భావిస్తారు.

# మారనున్న UPI చెల్లింపు విధానం.. భారీ ప్లాన్‌కు సిద్ధమవుతున్న ఆర్బీఐ!




భారతదేశంలో యూపీఐ, ఇతర డిజిటల్ చెల్లింపుల వాడకం వేగంగా పెరిగింది. నేడు ప్రజలు క్షణాల్లో ఏ ఖాతాకైనా డబ్బు పంపే సదుపాయం ఉంది. అయితే, డిజిటల్ చెల్లింపులు వేగంగా పెరిగినట్లే, ఆన్‌లైన్ మోసాల కేసులు కూడా పెరిగాయి. నకిలీ కాల్స్, మోసపూరిత పెట్టుబడులు, డీప్‌ఫేక్‌ల వంటి పద్ధతుల ద్వారా ప్రజలు మోసపోతున్నారు. పెరుగుతున్న ఈ కేసుల సంఖ్య దృష్ట్యా, ఆర్‌బిఐ కొత్త భద్రతా ఎంపికలను పరిశీలిస్తోంది. మరోవైపు, బ్యాంకులు చెల్లింపు అనుభవానికి ఎటువంటి ఆటంకం కలిగించకుండా భద్రతను పెంచుకోవాలని కోరుకుంటున్నాయి. అందువల్ల వారు ఆర్‌బిఐకి కొన్ని కొత్త ప్రతిపాదనలను సమర్పించారు.ప్రతి లావాదేవీకి వర్తించదు:
ప్రతి ఆన్‌లైన్ లావాదేవీపై ఒక గంట ఆలస్యం విధించడం అసౌకర్యంగా ఉంటుందని బ్యాంకులు అంటున్నాయి. దీనివల్ల డిజిటల్ చెల్లింపుల వాడకం కూడా తగ్గే అవకాశం ఉంది. దానికి బదులుగా, బ్యాంకులు కేవలం కొన్ని సందర్భాల్లో మాత్రమే మరింత నిశిత పరిశీలన కోరుకుంటున్నాయి. ప్రతిపాదన ప్రకారం, లావాదేవీ సాధారణంగా ఉంటే మునుపటిలాగే డబ్బు వెంటనే బదిలీ అవుతుంది. అయితే, సిస్టమ్ ఒక లావాదేవీని అనుమానాస్పదంగా భావిస్తే, అదనపు ధృవీకరణ కోరుతుంది.అనుమానాస్పద లావాదేవీ జరిగినప్పుడు మీరు నిజంగా ఈ డబ్బును పంపాలనుకుంటున్నారా అని అడుగుతూ మొబైల్ యాప్‌లో ఒక సందేశం కనిపించాలని బ్యాంకులు సూచించా యి. ఆ సందేశంలో వం, చీశీ ఆనే ఆప్షన్స్ ఉంటాయి.అని నొక్కడ ద్వారా డబ్బు తక్షణమే బదిలీ అవుతుంది.చీశీ అని ఎంచుకుంటే లావాదేవీ రద్దు అవుతుంది.ఎటువంటి స్పందన రాకపోతే సుమారు ఒక గంట తర్వాత లావాదేవీని పూర్తి చేయవచ్చు.దీంతో ఒకవేళ ఎవరైనా మోసం ప్రభావంతో డబ్బు పంపుతున్నట్లయితే అతనికి ఆలోచించడానికి కొంత సమయం దొరకవచ్చు.ఏ లావాదేవీలు తనిఖీ చేస్తారు?ఈ ప్రక్రియ ప్రతి చెల్లింపునకు వర్తించదు. బ్యాంకులు ఈ కింది వాటి వంటి అసాధారణ లావాదేవీలకు మాత్రమే హెచ్చరి కలను ప్రదర్శించడానికి ఇష్టపడతాయఅర్ధరాత్రి వేళ అకస్మాత్తుగా పెద్ద మొత్తంలో డబ్బు పంపడం. కొత్త ఖాతాకు మొదటిసారిగా డబ్బు బదిలీ చేయడం.భవిష్యత్తులో ఈ పరిమితిని రూ. 20,000 నుంచి రూ. 25,000 వరకు పెంచవచ్చని కొన్ని బ్యాంకులు భావిస్తున్నాయి. ఆన్‌లైన్ మోసాలు ఎంత వేగంగా పెరిగాయి? డిజిటల్ చెల్లింపులు పెరగడంతో సైబర్ మోసాల కేసులు కూడా విపరీతంగా పెరిగాయి. 2021లో సుమారు 2.6 లక్షల మోసాల కేసులు నమోదవ్వగా, వాటివల్ల రూ.551 కోట్ల నష్టం వాటిల్లింది. ఈ సంఖ్య 2025 నాటికి 2.8 లక్షల కేసులకు పెరిగింది. ఈ కాలంలో మోసాల విలువ కూడా రూ.22,931 కోట్లకు పెరిగింది. ఇది ఆన్‌లైన్ చెల్లింపులకు సంబంధించిన పెరుగుతున్న సైబర్ మోసాల తీవ్రతను స్పష్టం చేస్తోంది.చాలా సందర్భాలలో మోసగాళ్లు ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, నకిలీ పెట్టుబడి పథకాలు లేదా డీప్‌ఫేక్ వీడియోల ద్వారా ప్రజలను మోసగించి డబ్బు బదిలీ చేయిస్తారు. బాధితుడే స్వయంగా లావాదేవీని ప్రారంభిస్తాడు కాబట్టి, ఇటువంటి కేసులను అధీకృత పుష్ పేమెంట్ (ఞ్రా) మోసం అని అంటారు., ఆన్‌లైన్ మోసాలను అరికట్టడంతో పాటు, డిజిటల్ చెల్లింపులు చేసేటప్పుడు సామాన్య ప్రజలు గణనీయమైన ఇబ్బందులను ఎదుర్కోకుండా చూసే నిబంధనలను ప్రవేశపెడతారని ఆశిస్తున్నారు.

# ఓటమితోనే 94 ఏళ్ల హిస్టరీ మొదలు..



భారత్ తన తొలి టెస్టు మ్యాచ్‌ను 1932లో లార్డ్స్‌లో ఇంగ్లండ్‌తో ఆడింది. స్వాతంత్ర్యానికి ముందే మొదలైన ఆ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 158 పరుగుల తేడాతో విజయం సాధించింది. 100వ టెస్టు కూడా ఇంగ్లండ్‌తోనే జరిగింది. 1967లో బర్మింగ్‌హామ్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు 132 పరుగులతో భారత్‌ను ఓడించింది. దీంతో తొలి రెండు మైలురాళ్ల టెస్టుల్లోనూ టీమిండియాకు పరాజయాలే ఎదురయ్యాయి. 200వ టెస్టులో డ్రా.. 300వ మ్యాచ్‌లో విజయం1982లో లాహోర్‌లో పాకిస్థాన్‌తో జరిగిన 200వ టెస్టు డ్రాగా ముగిసింది. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 485 పరుగులు చేయగా, భారత్ తరఫున మొహిందర్ అమర్‌నాథ్ సెంచరీతో 389 పరుగులు చేసింది. చివరికి మ్యాచ్ ఫలితం తేలలేదు.లంక సిరీస్‌తో ఆ ఇద్దరి కెరీర్‌కు ఎండ్ కార్డ్.. లగేజీ సర్దేయండి
1996లో అహ్మదాబాద్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన 300వ టెస్టులో భారత్ సత్తా చాటింది. తొలి ఇన్నింగ్స్‌లో 223 పరుగులు చేసిన టీమిండియా, రెండో ఇన్నింగ్స్‌లో 190 పరుగులకు ఆలౌటైంది. 170 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకున్న భారత్ 64 పరుగులతో గెలిచింది. 400, 500వ టెస్టుల్లోనూ భారత్‌దే జోరు..2006లో కింగ్‌స్టన్‌లో వెస్టిండీస్‌తో జరిగిన 400వ టెస్టులో భారత్ 49 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా 200 పరుగులు చేయగా, వెస్టిండీస్ 103కే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 171 పరుగులు చేసింది. 2016లో కాన్పూర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన 500వ టెస్టు మరింత ఘనంగా సాగింది. భారత్ టెస్టు కూడా భారత జ్ఞాపకాల్లో నిలిచిపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో 318 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 377/5 చేసింది. కివీస్ 262, 236 పరుగులకే పరిమితమై 197 పరుగుల తేడాతో ఓడిపోయింది. 600వ టెస్టులో సరికొత్త అధ్యాయం..ఇప్పుడు 2026లో గాలేలో శ్రీలంకతో జరిగిన 600వ టెస్టు కూడా భారత జ్ఞాపకాల్లో నిలిచిపోయింది. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులు చేసింది. శ్రీలంక 284 పరుగులకు ఆలౌట్ కాగా, భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 193 పరుగులు చేసింది.

# పీఎఫ్‌పై కేంద్ర ప్రభుత్వం సూపర్ న్యూస్.. ఇకపై రూ.25 వేలు.. త్వరలో నిర్ణయం..!




దేశంలో ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేసేవారికి ఊరట కలిగించేలా కేంద్ర ప్రభుత్వం కొత్త నిర్ణయానికి శ్రీకారం చుడుతోంది. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్(జ్పూఫ్) పథకం పరిధిని మరింత విస్తరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటివరకు పీఎఫ్ కనీస శాలరీ లిమిట్ రూ.15 వేలు మాత్రమే ఉంది. దీంతో రూ.15 వేలు శాలరీ ఉన్నవారు ఖచ్చితంగా పీఎఫ్‌లో చేరాల్సి ఉంటుంది. ఆ పైన వేతనం పొందేవారు స్వచ్ఛంధంగా ఇందులో చేరవచ్చు. యజమాని, ఉద్యోగి అంగీకారంతో పీఎఫ్ పరిధిలో చేరవచ్చు. దీంతో అధిక జీతం పొందేవారు పీఎఫ్ ప్రయోజనాలకు దూరమవుతున్నారు. దీంతో పీఎఫ్ వేతన పరిమితిని పెంచాలనే డిమాండ్లు ఎప్పటినుంచో వినిపిస్తుండగా.. ఇప్పుడు కేంద్రం ఎట్టకేలకు దిగొచ్చింది.
రూ.25 వేలకు వేతన పరిమితి పెంపు..!
పీఎఫ్ శాలరీ లిమిట్‌ను రూ.25 వేలకు పెంచేందుకు కేంద్ర ఆర్థికశాఖ ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. అయితే కేంద్ర ఆర్థికశాఖ ఈ ప్రతిపాదనను కేబినెట్ ముందు ఉంచనుంది. కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన తర్వాత కొత్త వేతన పరిమితి అమల్లోకి వస్తుంది. వేతన పరిమితి పెంచడం వల్ల చాలామంది ఉద్యోగులు పెన్షన్ పరిధిలోకి రానున్నారు. రిటైర్మెంట్ తర్వాత ప్రతీనెలా పెన్షన్ ప్రయోజనాలు అందుకోనున్నారు. వేతన పరిమితి పెరగడం వల్ల పెన్షన్ కూడా పెరుగుతుంది. ప్రస్తుత వేతన పరిమితి రూ.15 వేలుగా ఉండటంతో.. 12 శాతం చొప్పున లెక్కిస్తే రూ.1800 కట్ అవుతుంది. దీని ప్రకారం పెన్షన్ చెల్లింపులు లెక్కిస్తారు. పెన్షన్ = (సగటు జీతం ఇ సర్వీసు కాలం)/70 ప్రాతిపదికన పెన్షన్ లెక్కిస్తారు. 10 ఏళ్ల సర్వీసుకు ఎంత పెన్షన్ వస్తుంది..
ఒక వ్యక్తి 10 ఏళ్లు ఉద్యోగం చేస్తే ప్రస్తుతం ఉన్న రూ.15 వేల వేతన పరిమితి ప్రకారం రూ.2,143 పెన్షన్ వస్తుంది. అదే రూ.25 వేలకు పెంచితే రూ.3,571కి పెరుగుతుంది. ఇక 20 ఏళ్లు ఉద్యోగం చేసినవారికి ప్రస్తుతం రూ.4,714 అందుతుంది. రూ.25 వేలకు పెరిగే రూ.7,857కు పెన్షన్ అమౌంట్ పెరుగుతుంది. ఇక 30 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసినవారికి ప్రస్తుత రూ.15 వేల లిమిట్ ప్రకారం రూ.6,857 అందుతుంది. రూ.25 వేలకు పెరిగితే రూ.11,429కి పెరుగుతుంది. వేతన పరిమితి పెరగడం వల్ల పెన్షన్ అమౌంట్ కూడా పెరగనుంది. దీని వల్ల రిటైర్మెంట్ తర్వాత పెన్షన్ ప్రతీ నెలా అధిక మొత్తంలో పొందవచ్చు. అయితే ప్రస్తుతం కనీస పెన్షన్ రూ.వెయ్యిగా ఉండగా.. దీనిని రూ.5 వేలకు పెంచాలనే డిమాండ్లు ఉద్యోగాల సంఘాల



## బ్యాడ్ లక్.. ఆ ఒక్క కారణంతో నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమాను రిజెక్ట్ చేసిన హీరో రాజ్ తరుణ్?

ఒకప్పుడు యూత్ ఫుల్ లవ్ స్టోరీలతో ఆకట్టుకున్న హీరో రాజ్ తరుణ్ ఇప్పుడు వరుస ఫ్లాప్ లతో సతమతమవుతున్నాడు. వరుసగా సినిమాలు, వెబ్ సిరీస్ లు చేస్తున్నా సక్సెస్ మాత్రం అందుకోలేకపోతున్నాడీ యంగ్ హీరో. అయితే ఇందుకు రాజ్ తరుణ్ తీసుకున్న నిర్ణయాలు కూడా ఒక కారణమని తెలుస్తోంది.రాజ్ తరుణ్.. ఒకప్పుడు ప్రేమ కథా చిత్రాలు, యూత్ ఫుల్ స్టోరీలతో క్రేజీ హీరోగా గుర్తింపు తెచ్చుకున్నాడు రాజ్ తరుణ్. ఉయ్యాల జంపాల సినిమాతో ఇండస్ట్రీకి హీరోగా పరిచయమైన రాజ్ తరుణ్ కుమారి 21 ఎఫ్ సినిమాతో సూపర్ హిట్ అందుకున్నాడు. ఆ వెంటనే సినిమా చూపిస్తా మావా తో మరో హిట్ ఖాతాలో వేసుకున్నాడు. ఈడో రకం ఆడో రకం, నాన్న నేను బాయ్ ఫ్రెండ్స్, కిట్టు ఉన్నాడు జాగ్రత్త, అందగాడు, రాజుగాడు, లవర్, ఇద్దరి లోకం ఒకటే, ఒరేయ్ బుజ్జిగా, పవర్ ప్లే తదితర సినిమాలతో మినిమం గ్యారెంటీ హీరోగా మారిపోయాడు రాజ్ తరుణ్. అయితే ఆ తర్వాత వరుస పరాజయాలు ఎదుర్కొన్నాడీ యంగ్ హీరో. అనుభవించు రాజా, స్టాండప్ రాహుల్, పురుషోత్తముడు, తిరగబడరా సామీ, భలే ఉన్నాడే, చిరంజీవ , పాంచ్ మినార్ సినిమాలు పెద్దగా ఆడలేదు. దీంతో నా సామి రంగా వంటి మల్టీ స్టారర్ సినిమాల్లో నటించాడు రాజ్ తరుణ్. స్టార్ హీరో రేంజ్ కు వెళ్లాల్సిన రాజ్ తరుణ్ ఇప్పుడు రేసులో బాగా వెనకపడిపోయాడు. దీనికి తోడు వ్యక్తిగత జీవితంలో తలెత్తిన ఇబ్బందులు ఈ ట్యాలెంటెడ్ హీరో గ్రాఫుని తగ్గించేశాయి. ఇదిలా ఉంటే ఈ పరిస్థితికి రాజ్ తరుణ్ తీసుకున్న నిర్ణయాలు కూడా ఒక కారణమని తెలుస్తోంది. ముఖ్యంగా సినిమాల సెలెక్షన్ లో రాజ్ తరుణ్ తప్పటడుగులు వేశాడు.గతంలో దిల్ రాజు ప్రొడక్షన్ లో శర్వానంద్ హీరోగా వచ్చిన 'శతమానం భవతి' సినిమా కథని మొదట రాజ్ తరుణ్ కోసం అనుకున్నారట. అతనికి కథ కూడా వినిపించారు. ఇక అతనే హీరోగా అఫీషియల్ అనౌన్స్ మెంట్ కూడా చేద్దామనుకున్నారట. అయితే ఇంతలోనే రాజ్ తరుణ్ మేనేజర్ రాజా రవీంద్ర ఆ కథ అంత ఎఫెక్టివ్ గా లేదనడంతహీరోగా వచ్చిన 'శతమానం భవతి' సినిమా కథని మొదట రాజ్ తరుణ్ కోసం ో రాజ్ తరుణ్ ఈ సినిమా నుంచి పక్కకు తప్పుకున్నాడట. కట్ చేస్తే.. శతమానం భవతి సినిమా కథ శర్వానంద్ దగ్గరకు వెళ్లడం బ్లాక్ బస్టర్ అవ్వడం తెలిసిందే. అంతేకాదు ఈ సినిమాకు నేషనల్ అవార్డు కూడా వచ్చింది. శతమానం భవతి సినిమా కథను రాజ్ తరుణ్ కంటే రాజా రవీంద్రనే రిజెక్ట్ చేశాడట. ఈ విషయాన్ని అతనే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. మొత్తానికి తన తొందరపాటు నిర్ణయంతో ఒక నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమాను చేజేతులా వదులుకున్నాడు రాజ్ తరుణ్. ఒకవేళ అతను గనక ఈ సినిమాను చేసి ఉంటే అతని కెరీర్ కు మంచి హెల్ప్ అయ్యేదని సినీ అభిమానులు అభిప్రాయ పడుతున్నారు.

## తెలుగులో రెండు సినిమాలేచేసింది కానీ కుర్రాళ్ల గుండెల్లో ప్రింట్ అయ్యింది

అందాల ముద్దుగుమ్మలు ఎప్పుడూ అభిమానులను కవ్విస్తూనే ఉంటారు. కుదిరితే సినిమాలు లేకుంటే సోషల్ మీడియా ద్వారా అభిమానులను ఎప్పుడూ పలకరిస్తూనే ఉంటారు. అయితే ఓవర్ నైట్ లో కుర్రాళ్ల డ్రీమ్ గర్ల్ గా మారిపోయిన ముద్దుగుమ్మలు చాలా మంది ఉన్నారు. వారిలో పైన కనిపిస్తున్న హీరోయిన్ ఒకరు. తెలుగులో చేసింది తక్కువ సినిమాలే కానీ ఈ బ్యూటీకి మంచి క్రేజ్ ఉంది. ఇప్పుడు ఆమె అందానికి కుర్రాళ్ళు ఫిదా అవుతున్నారు. క్యూట్ నెస్ కు కేరాఫ్ అడ్రస్ ఆమె.. అందం మాత్రమే కాదు అదిరిపోయే అభినయం ఈ వయ్యారిది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.?ఆ ఫొటోలో ఉన్న ముద్దుగుమ్మ మరెవరో కాదు సోషల్ మీడియాతో విపరీతమైన క్రేజ్ తెచ్చుకున్న బ్రిగిడా సాగ. ఈ ముద్దుగుమ్మ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు.ఇప్పుడు ఆమె అందానికి కుర్రాళ్ళు ఫిదా అవుతున్నారు. క్యూట్ నెస్ కు కేరాఫ్ అడ్రస్ ఆమె.. అందం మాత్రమే కాదు అదిరిపోయే అభినయం ఈ వయ్యారిది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.?ఆ ఫొటోలో ఉన్న ముద్దుగుమ్మ మరెవరో కాదు సోషల్ మీడియాతో విపరీతమైన క్రేజ్ తెచ్చుకున్న బ్రిగిడా సాగ. ఈ ముద్దుగుమ్మ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు.ఈ అమ్మడు టెలివిజన్ నుంచి ఇండస్ట్రీలోకి వచ్చింది. విశాల్ హీరోగా నటించిన అయోగ్య సినిమాతో ఇండస్ట్రీలోకి వచ్చింది. ఇరవిన్ నిజాల్ అనే సినిమాలో నటించింది బ్రిగిడా సాగ. ఈ సినిమాలో నగ్నంగా నటించి షాక్ ఇచ్చింది. ఇందులో చిలకమ్మ అనే పాత్ర పోషించింది. ఈ సినిమాలో ఆమె నటనకు ప్రశంసలు దక్కాయి. ఆతర్వాత ఆమె వరుసగా సినిమా ఆఫర్స్ అందుకుంది. ఈ అమ్మడు టెలివిజన్ నుంచి ఇండస్ట్రీలోకి వచ్చింది. విశాల్ హీరోగా నటించిన అయోగ్య సినిమాతో ఇండస్ట్రీలోకి వచ్చింది. ఇరవిన్ నిజాల్ అనే సినిమాలో నటించింది బ్రిగిడా సాగ. ఈ సినిమాలో నగ్నంగా నటించి షాక్ ఇచ్చింది. ఇందులో చిలకమ్మ అనే పాత్ర పోషించింది. ఈ సినిమాలో ఆమె నటనకు ప్రశంసలు దక్కాయి. ఆతర్వాత ఆమె వరుసగా సినిమా ఆఫర్స్ అందుకుంది. బ్యూటీ చాలా ఫేవరెట్ హీరోయిన్.. కుర్రాళ్ళ ఆమె చాలా చూడముచ్చటగా ఉంటుంది. మొఖంలో భలే కళ ఉంటుంది. ఈ అమ్మడు సిందూరం అనే సినిమాతో తెలుగులోకి అడుగుపెట్టింది. ఈ సినిమా పర్లేదు అనిపించుకుంది. ఇక ఈ అమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఈ బ్యూటీ షేర్ చేసే ఫోటోలు అభిమానులు ఆకట్టుకుంటున్నాయి.బ్యూటీ చాలా ఫేవరెట్ హీరోయిన్.. కుర్రాళ్ళ డ్రీమ్ గర్ల్.. అందం కంటే ఆమె చాలా చూడముచ్చటగా ఉంటుంది. మొఖంలో భలే కళ ఉంటుంది. ఈ అమ్మడు సిందూరం అనే సినిమాతో తెలుగులోకి అడుగుపెట్టింది. ఈ సినిమా పర్లేదు అనిపించుకుంది. ఇక ఈ అమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఈ బ్యూటీ షేర్ చేసే ఫోటోలు అభిమానులు ఆకట్టుకుంటున్నాయి.





## ఇన్‌స్టాగ్రామ్‌లో14 మిలియన్ల ఫాలోవర్లు..

కేజీఎఫ్, కేజీఎఫ్ 2 సినిమాలతో పాన్ ఇండియా హీరోగా మారిపోయాడు యశ్. ఇప్పుడీ హీరోకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. కేజీఎఫ్ 2 తర్వాత చాలా గ్యాప్ తీసుకున్న యశ్ ఇప్పుడు టాక్సిక్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో పాటు మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'రామాయణం'లో రావణుడి పాత్రలో నటిస్తున్నాడు యశ్. ఈ రెండు సినిమాలతో యశ్ క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. ముఖ్యంగా సోషల్ మీడియాలోనూ రాకింగ్ స్టార్ కు భారీగా ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ప్రస్తుతం ఇన్ స్టా గ్రామ్ లో యశ్ కు 14 మిలియన్లకు (1.4 కోట్ల) పైగా ఫాలోవర్లు ఉన్నారు. అయితే యశ్ మాత్రం కేవలం ఒకే ఒక్కరిని మాత్రమే ఫాలో అవుతున్నారు. ప్రస్తుతం టాక్సిక్ సినిమా ప్రమోషన్లలో బిజీ బిజీగా ఉంటున్నాడు యశ్. నేషనల్ మీడియా ఛానెల్స్ కు వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తున్నాడు. ఈ క్రమంలోనే తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నాడు యశ్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఒక అమ్మాయి హీరో యశ్ ను ఒక ప్రశ్న అడిగింది. "మీకు ఇన్‌స్టాగ్రామ్‌లో 14 మిలియన్లకు పైగా ఫాలోవర్లు ఉన్నారు, కానీ మీరు కేవలం ఒక్క వ్యక్తిని మాత్రమే ఫాలో అవుతారు. ఎవరా వ్యక్తి, మీ జీవితంలో వారి విలువ ఏమిటి?' అని రాకింగ్ స్టార్ ను అడిగింది. దీనికి యశ్ నవ్వుతూ 'ఆమె నా భార్య"అని ఎంతో ప్రేమగా ఆన్సర్ ఇచ్చాడు. ఇది విన్న స్టూడియో మొత్తం చప్పట్లతో మార్మోగిపోయింది.'ఆమె నా భార్య మాత్రమే కాదు, నా జీవితంలో ఉన్న ఏకైక బెస్ట్ ఫ్రెండ్ కూడా. ఒకవేళ నేను తనని కూడా ఫాలో అవ్వకుండా జీరో పెడితే నాకు ఇబ్బందులు తప్పవు (నవ్వుతూ) .. నిజం చెప్పాలంటే, ఆమె నా జీవితంలో అత్యంత ముఖ్యమైన వ్యక్తి. మేమిద్దరం కలిసి ఎదిగాము. ఆమె నాకు భార్యగా దొరకడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఆమె నా జీవితానికి బలమైన ఆధారం' అని తన భార్య గురించి గొప్పగా చెప్పుకొచ్చారు యశ్. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్

## ఆమె అద్భుతమైన హీరోయిన్.. తనతో మూడు సినిమాలు చేశా..



ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు కృష్ణవంశీ ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో నటి ఛార్మి కెరీర్ గురించి, అలాగే తన చిత్రాలలో పనిచేసిన ఇతర నటీమణులతో తన వృత్తిపరమైన సంబంధాల గురించి కొన్ని కీలక విషయాలను పంచుకున్నారు. ఛార్మి అపారమైన ప్రతిభను కలిగి ఉన్నప్పటికీ, ఆమెకు తగిన గుర్తింపు, విజయం దక్కకపోవడం వెనుక గల కారణాలపై ఆయన వివరించారు. కృష్ణవంశీ మాటల్లో ఛార్మిని టెర్రిఫిక్ యాక్ట్రెస్గా, వెరీ గుడ్ ఆర్టిస్టా తెలిపారు. ఆమె అద్భుతమైన అభినయ సామర్థ్యం, కథను గ్రహించగల శక్తి, భావోద్వేగాలను పలికించగల కళ్ళు, గొప్ప నృత్య ప్రతిభను కలిగి ఉందని ఆయన అన్నారు. ఆమెలో ఒక ప్రత్యేకమైన జోష్, ఎనర్జీ ఉంటాయని తెలిపారు. ఛార్మి నిబద్ధతకు ఉదాహరణగా, శ్రీ ఆంజనేయం, చక్రం చిత్రాల షూటింగ్ సమయంలో ఆమె ఎంతటి అంకితభావంతో పనిచేసిందో వివరించారు. ఒక షాట్ కోసం గాయాలైనప్పటికీ, ఆమె ఆగకుండా పనిచేసేదని ఆయన గుర్తుచేసుకున్నారు.



## రేస్‌లో వెనకబడ్డ వయ్యారి భామ.

టాలీవుడ్ ఆడియన్స్ కు హీరోయిన్ సురభి సుపరిచితమే. బీరువా, ఎక్స్ ప్రెస్ రాజా, ఒక్క క్షణం వంటి చిత్రాలతో టాలీవుడ్ అడియన్స్?కు దగ్గరయ్యింది ఈ ముద్దుగుమ్మ. తన అందంతో కుర్రకారును కట్టిపడేసింది. ఆ తర్వాత తెలుగులో అవకాశాలు రాకపోవడంతో తమిళంలో ఆడపాదడపా సినిమాలు చేసింది. కానీ అక్కడ కూడా పెద్దగా సక్సెస్ అవ్వలేదు. తెలుగు, తమిళం, కన్నడ భాషలలో మంచి గుర్తింపు తెచ్చుకుంది సురభి. కానీ అవకాశాలు మాత్రం ఆశించిన స్థాయిలోరాలేదు.యంగ్ హీరో సందీప్ కిషన్ నటించిన బీరువా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది అందాల ముద్దుగుమ్మ సురభి. ఈ సినిమా సక్సెస్ తర్వాత సురభికి ఆఫర్లు బాగానే వచ్చాయి. వరుసగా సినిమాలు చేసింది. తెలుగు, తమిళం, కన్నడ భాషలలో మంచి గుర్తింపు తెచ్చుకుంది సురభి. కానీ అవకాశాలు మాత్రం ఆశించిన స్థాయిలోరాలేదు.యంగ్ హీరో సందీప్ కిషన్ నటించిన బీరువా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది అందాల ముద్దుగుమ్మ సురభి. ఈ సినిమా సక్సెస్ తర్వాత సురభికి ఆఫర్లు బాగానే వచ్చాయి. వరుసగా సినిమాలు చేసింది. ఈ క్రమంలోనే 'ఎటాక్', 'జెంటిల్ మేన్', 'ఒక్క క్షణం', 'ఓటర్' తదితర చిత్రాల్లో నటించింది. కానీ ఈ సినిమాల్లో నాని సినిమా తప్ప మిగిలిన సినిమాలన్నీ నిరాశపరిచాయి. దాంతో ఈ అమ్మడికి మెల్లగా ఆఫర్స్ తగ్గుతూ వచ్చాయి. తమిళంలోనూ ఈ అమ్మడు పలు సినిమాలు చేసింది. అక్కడా ఈ బ్యూటీకి అదృష్టం కలిసి రాలేదు. ఈ క్రమంలోనే 'ఎటాక్', 'జెంటిల్ మేన్', 'ఒక్క క్షణం', 'ఓటర్' తదితర చిత్రాల్లో నటించింది. కానీ ఈ సినిమాల్లో నాని సినిమా తప్ప మిగిలిన సినిమాలన్నీ నిరాశపరిచాయి. దాంతో ఈ అమ్మడికి మెల్లగా ఆఫర్స్ తగ్గుతూ వచ్చాయి. తమిళంలోనూ ఈ అమ్మడు పలు సినిమాలు చేసింది. అక్కడా ఈ బ్యూటీకి అదృష్టం కలిసి రాలేదు.చక్కని లావణ్యంతో ఆకర్షించే చూపులతో కుర్రాళ్లను ఆకట్టుకుంది అందాల భామ సురభి.. సురభి చివరగా యంగ్ హీరో ఆది నటించిన శశి సినిమాలో కనిపించింది. మ్యూజిక్ పరంగా ఈ మూవీకి మంచి రెస్పాన్స్ వచ్చినా.. బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయ్యింది. దీంతో సురభికి మళ్లీ అంతగా క్రేజ్ రాలేదు. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ పెద్దగా సినిమాలు చేయడం లేదు.చక్కని లావణ్యంతో ఆకర్షించే చూపులతో కుర్రాళ్లను ఆకట్టుకుంది అందాల భామ సురభి.. సురభి చివరగా యంగ్ హీరో ఆది నటించిన శశి సినిమాలో కనిపించింది. మ్యూజిక్ పరంగా ఈ మూవీకి మంచి రెస్పాన్స్ వచ్చినా.. బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయ్యింది. దీంతో సురభికి మళ్లీ అంతగా క్రేజ్ రాలేదు. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224